ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 136, పేజీలు - 08

మంగళవారం, నవంబర్ 17, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



నిత్యావసరాల ధరలతో సామాన్యుడికి షాక్!

- దేశ సగటును మించిన తెలంగాణ ద్రవ్యోల్బణం 7.26 శాతానికి చేరిన రిటైల్ ధరల పెరుగుదల

- గ్రామీణ ప్రాంతాల్లో 8.05 శాతం నమోదు - ఆహార ధరల పెరుగుదలతో కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్లు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి జేబుకు చిల్లులు పెడుతున్నాయి. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో సతమతమవుతున్న ప్రజలకు ద్రవ్యోల్బణం మరో షాక్ ఇచ్చింది. 2026 అక్టోబర్‌లో రాష్ట్ర రిటైల్ ద్రవ్యోల్బణం 7.26 శాతానికి చేరింది. ఈ ఏడాదిలో తొలిసారిగా 7 శాతం మార్కును దాటడం ఆందోళన కలిగిస్తోంది. సెప్టెంబర్‌లో 6.64 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం ఒక్క నెలలోనే గణనీయంగా పెరిగింది. జాతీయ సగటు 6.09 శాతంగా ఉండగా, తెలంగాణలో మాత్రం 1.17 శాతం పాయింట్లు అధికంగా నమోదైంది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 7 శాతానికి మించి ద్రవ్యోల్బణం నమోదైన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. గత పది నెలలుగా రాష్ట్రంలో ధరల పెరుగుదల జాతీయ సగటు కంటే అధికంగానే కొనసాగుతోంది. ఇది సామాన్య, మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

నెలనెలా పెరుగుతున్న ధరల భారం

ఈ ఏడాది జనవరిలో తెలంగాణ రిటైల్ ద్రవ్యోల్బణం 4.92 శాతంగా నమోదైంది. ఫిబ్రవరిలో 5.02 శాతానికి, మార్చిలో 5.83 శాతానికి చేరింది. మేలో 6.15 శాతం, జూన్‌లో 6.36 శాతంగా నమోదైంది. జూలై, ఆగస్టు

2లో..

బిల్కిస్ బానో కేసు దోషులకు
భారీ ఊరట

- 17 ఏళ్ల తర్వాత బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో జీవితఖైదు పడిన ఇద్దరు దోషులు బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ మోధియాలకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. వారి యావజ్జీవ కారాగార శిక్షను తాత్కాలికంగా



నిలిపివేస్తూ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 28వ తేదీన వెలువరించిన ఈ ఆదేశాల్లో ధర్మాసనం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. పిటిషనర్లు ఇప్పటికే 17 సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడిపారని, అంతేకాకుండా వారు దాఖలు చేసిన అప్పీలులో వాస్తవాలు, న్యాయపరమైన అంశాలు లోతుగా

2లో..

త్వరలో సంచలనాలంటూ
సీఎం రేవంత్ సంకేతాలు

- ఫోన్ ట్యాపింగ్ నిరూపించడం సిట్‌కు సాధ్యమేనా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుందని, త్వరలోనే ఈ కేసులో అనూహ్య పరిణామాలు, సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా ప్రకటన మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. తన ఫోన్‌ను ఎవరైనా ట్యాప్ చేసినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేస్తూనే, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ నిఘా వ్యవహారం విచారణ ముగింపు దశకు వచ్చిందని కీలక సంకేతాలు ఇచ్చారు. బదిలీ అయిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ పర్యవేక్షణలోని ప్రత్యేక దర్యాప్తు బృందం పలువురు రాజకీయ ప్రముఖులు, నిందితుల వాంగ్మూలాలను నమోదు చేసి తుది చార్జిషీట్ సిద్ధం చేసింది. సజ్జనార్ బదిలీ దర్యాప్తుపై ప్రభావం చూపదని .. త్వరలోనే కీలక పరిణామాలుంటాయని

2లో..

హైదరాబాద్‌పై
చలి పంజా

- 14 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావంతో ఆదివారం పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యు)లో అత్యల్పంగా 11.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో 13.4 డిగ్రీలుగా నమోదైంది.

2లో..

ముంచుకొస్తున్న
తుపాను ముప్పు... జాగ్రత్త

- ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

- గోదావరి, కృష్ణా, గుంటూరు సహా పలు జిల్లాలపై ప్రభావం

- ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి, కోస్తాంధ్ర తీరంవైపు తుఫాన్‌గా దూసుకొచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 20వ తేదీన ఈ తుఫాన్ తీరాన్ని దాటే ఛాన్స్ ఉందని తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్ యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. ముప్పు తీవ్రతపై సీఎం నారా చంద్రబాబు నాయుడు నేరుగా రంగంలోకి దిగారు. అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం వేదికగా అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

19, 20 తేదీల్లో భారీ వర్షాలు..

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

2లో..

హైదరాబాద్ భారత్ సమ్మిట్
వివాదం

- ఇటలీ నేతపై చర్యలకు తెలంగాణ బీజేపీ డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 'భారత్ సమ్మిట్' వేదికగా విదేశీ రాజకీయ ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సదస్సులో భారత వ్యతిరేక, రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం సోమవారం ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసింది. నవంబర్ 12 నుంచి నవంబర్ 14 వరకు నగరంలో నిర్వహించిన ఈ సదస్సులో విదేశీ ప్రతినిధులు చేసిన ప్రసంగాలు దేశ సమగ్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. ఎఫ్ఆర్ఆర్ఓ అధికారిని కలిసిన అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఇటలీకి చెందిన యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ నాయకుడు జియాకోమో ఫిలిబెక్ ఈ సదస్సుకు హాజరై భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారంలో భాగంగా వాడుతున్న 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఆయన ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించారని, ఇది స్పష్టంగా భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడమేనని మండిపడ్డారు.
వీసా నిబంధనల ప్రకారం ఏ విదేశీయుడైనా తాను సందర్శించే దేశానికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని రామచందర్ రావు గుర్తుచేశారు. అయితే అందుకు విరుద్ధంగా సదరు నేత భారత ప్రభుత్వం, ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచేలా వ్యవహరించారని ఆరోపించారు. ఇటలీ ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో వేదికపై ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టడం,

2లో..

విలువల కోసం రాజీలేని
పోరాటం చేసిన వ్యక్తి రామోజీరావు

- ఘన నివాళులర్పించిన అమిత్ షా



అమరావతి (ప్రశ్న న్యూస్) మీడియా రంగంలో నైతిక విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు తిరుగులేని ప్రతీకగా నిలిచారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. ఆయన కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, తన జీవితకాలంలోనే సమాజానికి మార్గదర్శనం చేసే ఒక మహోన్నత వ్యవస్థగా ఎదిగారని ప్రశంసించారు. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకులు రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విశిష్ట కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతిభావంతులకు 'రామోజీరావు ఎక్సలెన్స్ అవార్డుల'ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.

2లో..

రాజీవ్ మరణం తర్వాత పిల్లలే నాకు అమ్మ, నాన్న అయ్యారు

- ఢిల్లీలో సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదల



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తాజాగా "బిలాంగింగ్– ఏ జర్నీ ఆఫ్ లవ్" పేరుతో తన ఆత్మకథను రాశారు. ఈ పుస్తకం ఇప్పటికే అనధికారికంగా విడుదలై సంచలనాలు రేపుతుండగా.. ఇవాళ ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో అధికారికంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె పిల్లలు రాహుల్, ప్రియాంకతో పాటు కాంగ్రెస్ ఛీఫ్ ఖర్గే, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, వీడీ సతీషన్, విజయ్, హేమంత్ సోరెన్, అఖిలేష్, అభిషేక్ బెనర్జీ, ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మాజీ సీఎం అమరీందర్ సింగ్, సుప్రియా సూలేతో పాటు పలువురు విపక్ష నేతలు తరలివచ్చారు. ఈ సందర్భంగా తాను ఆత్మకథ రాయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్న దానిపై సోనియాగాంధీ కారణాన్ని బయటపెట్టారు.

2లో..

తెలంగాణలో కొత్తగా
4.63 లక్షల మందికి పెన్షన్లు

- ఈనెల 19న అకౌంట్లలోకి డబ్బులు జమ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేసింది. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి తొలి నెల పింఛన్ నగదును నేరుగా జమ చేయనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. కొత్తగా ఎంపికైన వారిలో అత్యధికంగా వితంతువులు ఉండటం గమనార్హం.

ఐదు కేటగిరీల్లో 4.63 లక్షల మందికి పింఛన్లు

రాష్ట్రంలోని పేదలు, మహిళలు, దివ్యాంగులు, సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త పింఛన్లను మంజూరు చేసింది. మొత్తం 5 కేటగిరీల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. వితంతువులు 2,77,894 మంది దివ్యాంగులు 1,00,224 మంది, ఒంటరి మహిళలు 53,844 మంది, గీత కార్మికులు 27,444 మంది, చేనేత కార్మికులు 4,451 మంది ఉన్నారు. మొత్తం కలిపి 4,63,857 మంది లబ్ధిదారులు ఈనెల నుంచి కొత్తగా పెన్షన్లు అందుకోనున్నారు.
కొత్తగా మంజూరైన పింఛన్లలో వితంతువుల సంఖ్య అత్యధికంగా ఉంది. ఆ తర్వాత దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఉన్నారు. గీత, చేనేత కార్మికులకు కూడా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ 19వ తేదీన తొలి నెల పింఛన్ సొమ్మును నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

2లో..

నిత్యావసరాల ధరలతో సామాన్యుడికి షాక్!

నెలల్లో స్వల్పంగా తగ్గినప్పటికీ, సెప్టెంబర్ నుంచి మళ్లీ పెరుగుదల మొదలైంది. దీంతో అక్టోబర్‌లో 7.26 శాతానికి చేరి ఈ ఏడాది గరిష్ఠ స్థాయిని తాకింది. ధరల పెరుగుదల ఇదే స్థాయిలో కొనసాగితే రానున్న రోజుల్లో కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత భారంగా మారే ప్రమాదం ఉంది.

పల్లెల్లోనే అధిక ధరల సెగ

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. అక్టోబర్‌లో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 8.05 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 6.68 శాతంగా నమోదైంది. జాతీయ గ్రామీణ ద్రవ్యోల్బణం 6.63 శాతంతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 1.4 శాతం పాయింట్లు అధికంగా ఉంది. దీంతో పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే కుటుంబాలపై నిత్యావసర వస్తువుల ధరల భారం ఎక్కువగా పడుతోంది.

ఆహార ధరల పెరుగుదలే ప్రధాన కారణం

ద్రవ్యోల్బణం పెరుగుదలకు ఆహార వస్తువుల ధరలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.74 శాతంగా ఉండగా, అక్టోబర్‌లో 8.94 శాతానికి పెరిగింది. ముఖ్యంగా ఉల్లి ధరలు 116 శాతానికి పైగా పెరగడం కలవరపెడుతోంది. వెల్లుల్లి, అల్లం, నిమ్మకాయలు, బియ్యం వంటి నిత్యావసరాల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఫలితంగా నెలవారీ ఆదాయంలో అధిక భాగం ఆహార అవసరాలకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వాతావరణ మార్పులతో మరింత ముప్పు

అక్టోబర్‌లో రాష్ట్రంలో వర్షపాతం భారీగా తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంపై పడే అవకాశాలు ఉండటంతో రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల ధరలపై మరింత ఒత్తిడి పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. పంటల దిగుబడులు తగ్గితే కూరగాయలు, పండ్లు, ధాన్యాల సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికే పెరిగిన ధరలకు తోడు సరఫరా తగ్గితే వినియోగదారులపై అదనపు భారం తప్పకపోవచ్చు.

కుటుంబ బడ్జెట్లకు తప్పని కోతలు

నిత్యావసరాల ధరలు పెరుగుతుండటంతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తమ రోజువారీ ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూరగాయలు, పప్పులు, వంటనూనె, పాలు వంటి కనీస అవసరాలకే అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో విద్య, వైద్యం, రవాణా, ఇతర కుటుంబ అవసరాలకు కేటాయించే మొత్తంలో కోత విధించాల్సి వస్తోంది. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపడుతున్నప్పటికీ, సరఫరా వ్యవస్థలోని లోపాలు, వాతావరణ ప్రతికూలతలు కొనసాగితే రానున్న నెలల్లోనూ ధరల ఒత్తిడి తప్పకపోవచ్చని అంచనా.

ధరల నియంత్రణకు చర్యలేవీ.?

తెలంగాణలో ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తీసుకురావాలంటే ఆహార ఉత్పత్తిని పెంచడంతోపాటు సరఫరా వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. అవసరమైన వస్తువులపై సబ్సిడీలు అందించడం, మార్కెట్‌లో ధరల నియంత్రణకు తగిన జోక్యం చేసుకోవడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వినియోగదారులు కూడా సీజనల్ కూరగాయలు, స్థానికంగా లభించే ఉత్పత్తులను వినియోగించడం ద్వారా కొంతమేర ఖర్చులను తగ్గించుకోవచ్చు. మొత్తంగా తెలంగాణలో జాతీయ సగటును మించి కొనసాగుతున్న ద్రవ్యోల్బణం సామాన్యుడి జీవన వ్యయాన్ని పెంచుతూ కుటుంబ ఆర్థిక వ్యవస్థపై భారంగా మారుతోంది.

బిల్కిస్ బానో కేసు దోషులకు భారీ ఊరట

పరిశీలించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. 2017 మే నెలలో బాంబే హైకోర్టు తమ జీవితఖైదును సమర్థిస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వీరిద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేసే సమయంలో.. పిటిషనర్లలో ఒకరైన జోషి తీవ్రమైన శారీరక అంగవైకల్యంతో బాధ పడుతున్న విషయాన్ని కూడా ధర్మాసనం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుంది. విచారణ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది వీరి బెయిల్ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. వీరు చేసిన నేరం అత్యంత తీవ్రమైనదని, ట్రయల్ కోర్టుతో పాటు హైకోర్టు కూడా వీరి నేరాన్ని ఏకగ్రీవంగా నిర్ధారించాయని గుర్తుచేశారు. అయితే దోషుల తరఫు న్యాయవాది ఈ వాదనలను తోసిపుచ్చుతూ బలమైన అంశాలను కోర్టు ముందుంచారు. పిటిషనర్లలో ఒకరి పేరు అసలు ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) లోనే లేదని, నేరం జరిగిన దాదాపు మూడేళ్ల తర్వాత ఆయన్ను ఈ కేసులో ఇరికించారని న్యాయవాది వాదించారు.ఈ ఏడాది మార్చి నెలలో వీరి పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అంతకుముందు జరిగిన విచారణల్లోనూ డిఫెన్స్ న్యాయవాది పలు కీలక వాదనలు వినిపించారు. అత్యాచార ఆరోపణలకు సంబంధించి బాధితురాలు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో గానీ, వైద్య పరీక్షల సమయంలో డాక్టర్ ముందు నమోదు చేసిన స్టేట్‌మెంట్‌లో గానీ ఈ ఇద్దరు పిటిషనర్ల పేర్లను ప్రస్తావించలేదని తెలిపారు. ఘటన జరిగిన సమయంలో అక్కడున్న గుంపులో వీరు కూడా ఉండి ఉండవచ్చనే అంశం తప్ప, వీరు ప్రత్యక్షంగా నేరానికి పాల్పడినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. కాగా గతంలో గుజరాత్ ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేసిన 11 మంది దోషుల జాబితాలో వీరిద్దరూ ఉన్నారు. అయితే ఆ విడుదల ఉత్తర్వులను 2024 జనవరిలో సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ కేసులో శిక్ష తగ్గింపు నిర్ణయం తీసుకునే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం 11 మంది దోషులను రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించడంతో వారంతా తిరిగి జైలుకు వెళ్లారు. తాజాగా వీరిలో ఇద్దరికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ముంచుకొస్తున్న తుపాను ముప్పు.. జాగ్రత్త

అంతేకాదు గతంలో భయాందోళన సృష్టించిన అర్నబ్ తుఫాన్ తరహాలోనే తీవ్రత ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది.

అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

అంతేకాదు తుఫాన్ కన్ను ప్రధానంగా ఏడు జిల్లాలపై ఉండనుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలపై తీవ్ర ప్రభావం ఉండే ఛాన్స్ ఉంది. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు క్షణక్షణం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించడం జరిగింది. తుఫాన్ కదలికలను ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కరెంట్ పోతే వెంటనే రావాలి.. ముందే ఎన్డీఆర్ఎఫ్ మోహరింపు

అదే విధంగా తుఫాన్ విపత్తు నిర్వహణపై అధికారులకు సీఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన దిశానిర్దేశం చేయడం జరిగింది.

తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే తీర ప్రాంతాలకు వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ టీమ్‌లను తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడినా తీగలు తెగినా ఏ మాత్రం ఆలస్యం లేకుండా వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖను అలర్ట్ చేశారు. దీనికోసం సిబ్బంది, జనరేటర్లు, యంత్రాలను ముందుగానే ప్రిపేర్ చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా భారీ వర్షాలకు వచ్చే వరద నీరు వృథాగా పోకుండా, లేదా గ్రామాలను ముంచెత్తకుండా దానిని సమర్థవంతంగా రిజర్వాయర్లకు మళ్లించేలా ఇరిగేషన్ అధికారులకు కీలక సూచనలు చేశారు.

హైదరాబాద్‌పై చలి పంజా

ఆసిఫాబాద్ జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ చలి ప్రభావం అధికంగా ఉంది. తిర్యానిలో 12, కెరమెరిలో 13.3, వాంకిడిలో 13.7, జైనూర్, కాగజ్‌నగర్, రెబ్బెనలో 14.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాప్రా, చార్మినార్‌లో 13.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. పటాన్‌చెరులో 13.8, అమీర్‌పేట, శేరిలింగంపల్లిలో 14.1 డిగ్రీలు నమోదయ్యాయి. నగరంలో సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నాయని, జీహెచ్ఎంసీ పరిధిలో మరో 10 రోజుల పాటు ఇదే తరహా వాతావరణం కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పొడి వాతావరణం మరికొన్ని రోజులు కొనసాగనుండగా, ఉదయం వేళల్లో పొగమంచు కమ్మేస్తుండటంతో ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి ప్రధాన బస్ స్టేషన్లలో ఉదయం ప్రయాణికుల రద్దీ తగ్గింది. చలి తీవ్రత దృష్ట్యా పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాతావరణ మార్పుల వల్ల ఈ నెల 20 తర్వాత రాష్ట్రంలో వర్షాలు కురిసి, చలి తీవ్రత తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

త్వరలో సంచలనాలంటూ

సీఎం రేవంత్ సంకేతాలు

కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు.

ఐ ఫోన్ల హ్యాకింగ్ ఆధారాలు లభించడం కష్టమే!

అయితే, రాజకీయంగా ఈ కేసు చుట్టూ ఎన్ని ప్రకంపనలు రేగుతున్నా.. సాంకేతిక, న్యాయపరమైన కోణంలో దర్యాప్తు సంస్థలకు పెను సవాళ్లు పొంచి ఉన్నాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో బాధితులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రులు, ప్రతిపక్ష నేతలు, న్యాయమూర్తులు, ప్రముఖ వ్యాపారవేత్తల్లో అత్యధికులు వినియోగించేది అత్యంత కట్టుదిట్టమైన ఎన్‌క్రిప్షన్ భద్రత ఉండే యాపిల్ ఐఫోన్లు . సాధారణ ఫోన్ కాల్స్ లేదా ఎస్ఎంఎస్‌లను సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా ట్యాప్ చేయడం సులభమే అయినప్పటికీ, వాట్సాప్, ఫేస్‌టైమ్, ఐమెసేజ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ మాధ్యమాల ద్వారా ఐఫోన్లలో జరిగే సంభాషణలను హ్యాక్ చేయడం సాధారణ సాఫ్ట్‌వేర్లతో సాధ్యం కాదు.

ఆధారాలన్నీ ఇప్పటికే ధ్వంసం చేసినట్లుగా గుర్తింపు

ఇక్కడే అసలైన సాంకేతిక చిక్కు ఎదురవుతోంది. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ వంటి అత్యున్నత స్థాయి మిలిటరీ గ్రేడ్ స్పైవేర్ వినియోగించి ఉంటే తప్ప ఐఫోన్ల డేటాను తస్కరించడం అసాధ్యమని సైబర్ భద్రతా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

కానీ, నిందితులుగా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు తదితరులు అప్పట్లో ఆధారాలు దొరక్కుండా హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి మూసీ నదిలో పడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అసలైన సర్వర్ లాగ్స్ , టెలికాం సంస్థల సాంకేతిక ఆధారాలు లేదా స్పైవేర్ జాడలు లేకుండా, కేవలం నిందితులు, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా మాత్రమే ఐఫోన్ ట్యాపింగ్ జరిగిందని న్యాయస్థానంలో నిరూపించడం దర్యాప్తు సంస్థలకు కత్తిమీద సాములా మారనుంది.

వాంగ్మూలాలకు విలువ ఉండదు!

భారత సాక్ష్యాధారాల చట్టం ప్రకారం, పోలీసుల ఎదుట నిందితులు ఇచ్చే వాంగ్మూలాలకు కోర్టులో నేరుగా విలువ ఉండదు. వాటిని బలపరిచే బలమైన ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ తప్పనిసరి. ఒకవేళ సాంకేతిక ఆధారాలు బలహీనంగా ఉంటే, ట్రయల్ సమయంలో ఈ కేసు నిలబడటం కష్టమవుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అందుకే, సిట్ అధికారులు ఇప్పుడు విదేశీ టెక్నాలజీ నిపుణుల సహాయంతో ధ్వంసమైన హార్డ్ డిస్క్‌ల నుంచి డేటా రికవరీ చేయడం, లేదా ఇజ్రాయెల్ సంస్థల నుంచి కొనుగోలు చేసిన నిఘా పరికరాల ఇన్‌వాయిస్‌లు, విదేశీ సర్వర్ల లాగ్స్‌ను సేకరించడంపై ప్రధానంగా దృష్టి సారించారు.

మరోవైపు, సాంకేతిక సవాళ్లు ఎలా ఉన్నప్పటికీ రాజకీయంగా మాత్రం ఈ కేసును తుది అంకానికి తీసుకెళ్లడం ద్వారా బీఆర్ఎస్ అగ్రనాయకత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.ముఖ్యంగా విచారణ ముగింపు దశలో అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ఈ ట్యాపింగ్ జరిగిందనే కోణంలో కీలక నేతలకు నోటీసులు జారీ చేయడం లేదా సప్లిమెంటరీ చార్జిషీట్‌లో పెద్ద తలకాయల పేర్లను చేర్చడం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. త్వరలోనే సంచలనాలు ఉంటాయి అన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. సిట్ దాఖలు చేయబోయే తుది చార్జిషీట్‌లో కేవలం పోలీసు అధికారుల పాత్రే ఉంటుందా, లేక గత పాలకుల ప్రమేయంపై బలమైన సాంకేతిక ఆధారాలను బయటపెట్టి సంచలనం సృష్టిస్తారా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

హైదరాబాద్ భారత్ సమ్మిట్ వివాదం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వడం దేశాన్ని అవమానించడమేనని, కానీ వారికి ఆ విషయం అర్థం కాలేదని ఆయన విమర్శించారు. దేశాన్ని కించపరిచేలా వ్యవహరించిన ఈ చర్యకు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం దేశానికి, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీయులకు 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, దీని ప్రకారం ఫిలిబెక్ పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలు చేసిన అనంతరం సదరు వ్యక్తి దేశం విడిచి వెళ్లిపోయారని, అతడిని వెంటనే వెనక్కి రప్పించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కేవలం ఆయనపైనే కాకుండా, ఇలాంటి వ్యక్తులను ఆహ్వానించి భారత గడ్డపై దేశానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులపై కూడా దేశద్రోహానికి సహకరించిన వారిగా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే భారత్ సమ్మిట్ నిర్వాహకులు, ఈ సదస్సుకు హాజరైన వారి పూర్వాపరాలపై లోతైన దర్యాప్తు జరపాలని రామచందర్ రావు కోరారు. జార్జ్ సోరోస్ వంటి శక్తుల నుంచి నిధులు పొంది, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి, దేశంలో అరాచకం సృష్టించేందుకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

విలువల కోసం రాజీలేని

పోరాటం చేసిన వ్యక్తి రామోజీరావు

అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రామోజీ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ తదితరులు హాజరయ్యారు.సభనుద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ తొలుత తాను గొప్పదైన తెలుగు భాషలో మాట్లాడలేకపోతున్నందుకు సభికులకు క్షమాపణలు తెలిపారు. అనంతరం రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ప్రమాణస్వీకారం చేసిన సమయంలో తీవ్ర రద్దీ వల్ల తన వాహనం ముందుకుపోలేకపోయిందని ఆ సమయంలో చంద్రబాబు, రామోజీరావు కలసి తనను వారి కారులో ఎక్కించుకుని గుజరాత్ భవన్‌కు చేర్చారని, ఆ విధంగా రామోజీరావుతో తొలి పరిచయం ఏర్పడిందని వివరించారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్షుడిగా, కేంద్ర హోంమంత్రిగా నాలుగు సార్లు రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయన్ను కలిసే అవకాశం లభించిందని తెలిపారు.

ఎక్కువగా ప్రయాణాలు చేయకపోయినా దేశంలో ఏ మారుమూల ఏం జరిగినా రామోజీరావు టేబుల్ వద్దకు పూర్తి సమాచారం ఉండేదని, అది చూసి తాను ఆశ్చర్యపోయానని అమిత్ షా అన్నారు. హిందీ మాట్లాడని రామోజీరావు వద్ద ఉత్తరప్రదేశ్ ఎన్నికల సమయంలో అంత సమాచారం ఉండడం తనకు విస్మయం కలిగించిందని చెప్పారు. ఆనాడు యూపీ ఎన్నికల్లో క్షేత్రస్థాయి పరిస్థితులపై స్పష్టమైన విశ్లేషణ ఇచ్చారని, ఫలితాలు కూడా సరిగ్గా ఆయన చెప్పినట్లే వచ్చాయని గుర్తుచేశారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అనంతరం తాను ఆయన్ను కలిసినప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లోని వేర్పాటువాదం, తీవ్రవాదంపై ఆయన ఇచ్చిన సలహాలు, చూపిన అవగాహన అమోఘమని పేర్కొన్నారు. దేశ సమస్యల పరిష్కారానికి రామోజీరావు లాంటి వ్యక్తులను గౌరవ సలహాదారుగా తీసుకోవచ్చని తాను ఆ రోజే భావించినట్లు చెప్పారు.

కృష్ణా జిల్లాలోని ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, ఎటువంటి వారసత్వం లేదా జర్నలిజం డిగ్రీ లేకపోయినా కేవలం సంకల్ప బలం, కఠిన శ్రమతో రామోజీరావు 'ఈనాడు'ను ప్రారంభించారని అమిత్ షా గుర్తుచేశారు. తెలుగు ప్రజలకు నిజాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేసి గొప్ప విప్లవం సృష్టించారన్నారు. భారత జర్నలిజం రంగంలో రామోజీరావును కేవలం రామ్‌నాథ్ గోయెంకాతో మాత్రమే పోల్చగలమని వ్యాఖ్యానించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా ప్రాంతీయ భాషల్లో 24 గంటల వార్తా చానళ్లను ప్రారంభించి 'ఈటీవీ' ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న చివరి రోజుల్లో కూడా మొబైల్ మాధ్యమంలో వార్తలను అందించాలనే తపనతో ఆయన పనిచేశారని చెప్పారు. కేంద్రంలో గానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ అధికారంలో ఎవరున్నా ప్రభుత్వాల ఒత్తిళ్లకు లొంగకుండా తన మీడియా సంస్థల స్వాతంత్ర్యాన్ని రామోజీరావు కాపాడారని అమిత్ షా స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక నష్టాలు, సవాళ్లు ఎదురైనా జర్నలిజం విలువలకు కట్టుబడి ప్రజాస్వామ్య నాలుగో స్తంభాన్ని నిలబెట్టారని కొనియాడారు. 2016లో ఆయనకు పద్మవిభూషణ్ లభించినప్పుడు అది రామోజీరావు ఒక్కరికే కాకుండా మొత్తం జర్నలిజం రంగానికి, తెలుగువారి ఆత్మగౌరవానికి దక్కిన గౌరవమని గుజరాతీ పత్రికలు రాశాయని గుర్తుచేశారు. రామోజీ ఫిల్మ్ సిటీ ద్వారా భారతీయ సినీ రంగానికి ఆయన చేసిన సేవలు అద్వితీయమని ప్రశంసించారు.సైన్స్ అండ్ టెక్నాలజీ, యూత్ ఐకాన్, ప్రజాసేవ, కళలు-సంస్కృతి, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, జర్నలిజం, మహిళా సాధికారత తదితర 9 విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి ఈ కార్యక్రమంలో అవార్డులను అందజేశారు. జీవితంలో ఎన్నో అవార్డులు రావచ్చని, కానీ రామోజీరావు పేరుతో ఇచ్చే పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ప్రత్యేకమైన గౌరవమని అవార్డు గ్రహీతలకు అమిత్ షా అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సంస్కరణలు, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

రాజీవ్ మరణం తర్వాత పిల్లలే

నాకు అమ్మ, నాన్న అయ్యారు

తన అత్త ఇందిర, పిల్లలు రాహుల్, ప్రియాంక సహా కుటుంబం గురించి ప్రచారంలో ఉన్న అవాస్తవ, బాధాకర కథల కారణంగానే తాను ఆత్మకథ రాయాలని నిర్ణయించుకున్నట్లు సోనియా గాంధీ వెల్లడించారు. ఇందులో తన సొంత అనుభవాల్ని పంచుకోవడంతో పాటు తమ గురించి ఇతరులు రాసిన వాటికి అతీతంగా తమ కుటుంబ జీవితాన్ని అర్థం చేసుకునే అవకాశాన్ని పాఠకులకు అందించేందుకు చేసిన ప్రయత్నంగా దీన్ని అభివర్ణించారు. మన చుట్టూ కథలు, అబద్దాలు అల్లుతారని, నిజానికి ఏమాత్రం సంబంధం లేని బాధపెట్టే మాటలు అంటారని, తన భావాలు, కుటుంబం గురించి తెలిసిన విషయాలు బయటపెట్టేందుకు ఇదో మార్గమని భావించానని, ప్రజలు కూడా తన కథ వినడానికి సుముఖంగా ఉంటారని సోనియా తెలిపారు. మొదట్లో తన వ్యక్తిగత అనుభవాలు బయటపెట్టేందుకు సంకోచించినా, పిల్లలు రాహుల్, ప్రియాంక పుస్తకం రాయమని ప్రోత్సహించడంతో అంగీకరించినట్లు తెలిపారు. ఇందులో కొన్ని బాధాకరమైన విషయాలు తిరిగి తల్చుకోవడం కష్టంగా ఉండేదన్నారు. తానెప్పుడూ డైరీ రాయలేదని, అందుకే తన జీవితం, రాజకీయాలగురించి రాయడం సవాలుగా అనిపించిందన్నారు. తాను ఓ సమూహంలో ఇమిడిపోవడానికి ఎంత కష్టపడ్డానో ఈ పుస్తకం పేరు బిలాంగింగ్ ఇందులో పదే పదే వివరిస్తుందన్నారు. పెళ్లి తర్వాత అత్తారింట్లో ఇమిడిపోయేందుకు తాను మాత్రమే కాదని, ఎంతో మంది అమ్మాయిలు ఇలాగే ఇబ్బంది పడతారని, కానీ సర్దుకుపోవాలన్నారు. ఈ దేశాన్ని, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి మొదట్లో చాలా ఇబ్బంది పడ్డానని, కానీ క్రమంగా మెచ్చుకోవడం నేర్చుకున్నానని ఆమె అంగీకరించారు. రాజీవ్ గాంధీని పెళ్లి చేసుకోబోతున్నాననే విషయం తప్ప, దీని గురించి పెద్దగా ఆలోచించలేదన్నారు.

తెలంగాణలో కొత్తగా 4.63 లక్షల మందికి పెన్షన్లు

ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నగదు బదిలీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నగదు బదిలీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు సమాచారం. అవసరమైన అదనపు నిధులను కూడా విడుదల చేసింది.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్దిష్ట తేదీనే నగదు జమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీపావళి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలు, మండలాల స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నారు. నవంబర్ 18వ తేదీ నాటికి ఈ పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రస్తుతం తెలంగాణలో సుమారు 40.44 లక్షల మంది సామాజిక భద్రతా పింఛన్లు పొందుతున్నారు. తాజాగా మరో 4,63,857 మందిని చేర్చడంతో రాష్ట్రంలో మొత్తం పింఛన్ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 45 లక్షలకు చేరనుంది. దీంతో కొత్తగా పింఛన్లు మంజూరైన లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభించనుంది. మరోవైపు పింఛన్ నగదు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కానున్న నేపథ్యంలో లబ్ధిదారులు తమ ఖాతాలకు ఆధార్ సీడింగ్ పూర్తయిందో లేదో చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నగదు బదిలీలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే బ్యాంకును సంప్రదించాలని చెబుతున్నారు.

ఇందుకూరు సర్పంచ్ అభ్యర్థిగా కూటమి అభ్యర్థి

చవలం ఉమాదేవి నామినేషన్ దాఖలు

దేవీపట్నం ఇందుకూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కూటమి అభ్యర్థిగా చవలం ఉమాదేవి నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఉమాదేవి గారు మాట్లాడుతూ, ఇందుకూరు గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలను పరిష్కరించి ఇందుకూరు పంచాయతీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.కూటమి నాయకులు మాట్లాడుతూ, సేవా గుణం కలిగిన ఉమాదేవి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల నుండి విశేష మద్దతు లభిస్తోందని, ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.గతం నుండి కూడా ఉమాదేవి భర్త చవలం శివరామకృష్ణ టీడీపీ పార్టీ నుండి సేవలు అందించడం జరుగుతుంది

కొమిరిశెట్టి దివ్యకు ఎంజీయూ డాక్టరేట్



రామగిరి, నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగ పరిశోధకురాలు కొమిరిశెట్టి దివ్య డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందింది. "స్టడీస్ ఆన్ బయో యాక్టివ్ నైట్రోజన్ హెటెరోసైకిల

కార్తిక మాసాన్ని హరిహర మాసం అని ఎందుకంటారు?

– దీపారాధన నుంచి తులసీ పూజ వరకు ప్రతి ఆచారం వెనుక ఉన్న రహస్యం ఇదే



భారతీయ సనాతన ధర్మంలో ప్రతి మాసానికీ ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి పర్వదినానికీ ఒక పరమార్థం ఉంది. అయితే కొన్ని మాసాలుకేవలం పండుగలకే పరిమితం కాకుండా, మనిషి జీవన విధానాన్ని,ఆలోచనా సరళిని, ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయి.అలాంటి విశిష్టమైన మాసమే కార్తిక మాసం. శివారాధనకు, విష్ణుభక్తికి, దీపారాధనకు, తులసీ పూజలకు, ఉపవాసాలకు, దాన ధర్మాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చే ఈ మాసం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. కార్తిక మాసం అనగానే తెల్లవారు జామున నదీస్నానాలు, శివాలయాల్లో మారుమోగే రుద్ర నమక చమకాలు, ఆలయ ప్రాంగణాల్లో వెలిగే వేలాది దీపాలు, తులసికోట ముందు భక్తితో వెలిగించే ప్రమిదలు, కార్తిక సోమవార వ్రతాలు.. ఇలా ఒక నెల రోజుల వ్యవధిలో ఇన్ని నియమాలు పాటించమని ధర్మశాస్త్రాలు సూచించడం వెనక అనేక ఆధ్యాత్మిక శాస్త్రీయ రహస్యాలు దాగి ఉన్నాయి. కృత్తికా నక్షత్రంతో కూడిన పౌర్ణమి కాబట్టి ఈ మాసానికి కార్తికం అని పేరు. కృత్తిక అంటే అగ్ని. దానిని యజ్ఞం ద్వారా ఆరాధిస్తాం. ఆ అగ్నికి సూక్ష్మరూపం దీపం. పంచభూతాత్మకమైన సృష్టికి ప్రతీక దీపం. కార్తిక మాసంలో వ్రతాలు, నోములతో పాటు దీపారాధనకు ప్రాధాన్యం ఉంది. కార్తికం అంటేనే దీపాల పండుగ. దీపం చీకట్లను దూరం చేస్తుంది. ఒక దీపం అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని అందిస్తుంది. 'అసతో మా సద్గమయ.. తమసో మా జ్యోతిర్గమయ.. మృత్యోర్మా అమృతం గమయ..!' బృహదారణ్యక ఉపనిషత్తులోని ఈ ప్రార్థన భారతీయ ఆధ్యాత్మిక పరంపరలో జ్యోతికి (దీపాల వెలుగుకు) ఉన్న అత్యున్నత స్థానాన్ని తెలుపుతుంది. సూర్యుడు ఈ మాసమంతా తులా–వృశ్చికరాశుల్లో కదులుతుండగా, పౌర్ణమి నాడు చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు. దీంతో కార్తిక మాసంలో సూర్యకాంతి తగ్గి చీకటి దట్టంగా ఉంటుంది. సూర్యాస్తమయం త్వరగా అవుతుంది. మానవుల శరీరమూ శక్తిని పుంజుకోలేక నీరసపడే సమయమిది. ఆ శక్తిని ఉత్తేజితం చేయడంతో పాటు చీకట్లను పారద్రోలేందుకు ఉదయం పూట నెయ్యితో, సాయంకాలం నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తారు. మనలో ఉండే పంచతత్వాలకు ప్రతీకగా అయిదు రుచులతో ఉండే ఉసిరికపైన దీపాన్ని వెలిగించడం ఈ మాసంలో ప్రత్యేకంగా భావిస్తాం. ఈ మాసంలో రెండు సంధ్యలలో దీపారాధన చేస్తారు. వాటిలో సాయం సంధ్యాదీపం విశేషమైనది. ఆ సమయంలో హరిహర ఆలయాల్లో కానీ, పూజా మందిరంలో కానీ, తులసి కోట దగ్గర కానీ దీప ప్రజ్వలన చేస్తారు. కార్తికంలో కనిపించే మరో సంప్రదాయం ఎత్తైన ప్రదేశాల్లో వెలిగించే ఆకాశదీపం. ఇళ్ల వద్ద, ఆలయాల వద్ద ప్రాంతీయ ఆచారాలకు అనుగుణంగా దీన్ని ఏర్పాటు చేస్తారు. ఆకాశం వైపు వెలిగే ఈ జ్యోతి విశ్వవ్యాప్తమైన దైవచైతన్యాన్ని స్మరించే ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఈ ఆకాశదీపాలను తులసి కోట పక్కన పొడవైన కొయ్య స్తంభాన్ని ఏర్పాటు చేసి కొయ్య పలకలపైన ఆకాశదీపాన్ని నువ్వుల నూనెతో వెలిగిస్తారు. ఇంటి గడప దగ్గర వెలిగించే దీపం కుటుంబ శ్రేయస్సును కోరుకుంటే, ఆకాశదీపం సమస్త లోక కల్యాణాన్ని ఆకాంక్షించే భావనకు ప్రతీకగా చూస్తాం. కార్తికంలో వెలిగించే దీపం సర్వ శ్రేయోదాయకమని, అలాగే ద్రవ్యాలను బట్టి చేసే దీపదానాలు కూడా చాలా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం)లో అరుణాచల పర్వతంపై వెలిగించే మహాదీపం శివుని అనంతజ్యోతికి ప్రతీక. పర్వత శిఖరంపై కనిపించే ఆ మహాజ్యోతిని దర్శించుకోవడం కోసం లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఒక చిన్న ప్రమిదలో ప్రారంభమైన జ్యోతి, ఒక పర్వత శిఖరంపై విశ్వాన్ని స్మరింపజేసే మహాజ్యోతిగా ఆవిష్కృతమవడం కార్తికమాస ఆధ్యాత్మిక వైభవానికి ప్రత్యక్ష నిదర్శనంలా కనిపిస్తుంది.

శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసంగా ఈ నెలను చెబుతారు. శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే.. ఈ మాసంలో శివుడికి, విష్ణువుకు విశేష పూజలు చేస్తారు అందుకే ఈ మాసాన్ని హరిహర మాసంగా పిలుస్తాం. విష్ణు సహస్రనామ పారాయణం, సత్యనారాయణస్వామి వ్రతాలు, శివారాధన తప్పనిసరిగా చేస్తారు. ఈ మాసంలో మరో ముఖ్యమైన ఆచారం బిల్వార్చన, తులసీ పూజలు. మూడు ఆకులతో కూడిన బిల్వదళాన్ని పరమశివుడికి సమర్పించడం ఈ మాసం శివారాధనలో అత్యంత ప్రీతికరమైనది. 'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చ త్రియాయుధమ్.. త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్..' అని బిల్వాష్టకంలో చెబుతాం. బిల్వ దళంలోని మూడు ఆకులను త్రిమూర్తులకు, త్రిగుణాలకు, శివుడి త్రినేత్రాలకు ప్రతీకలుగా వివిధ భక్తి వ్యాఖ్యానాలు వివరిస్తాయి. బిల్వదళాన్ని సమర్పించడం అంటే ప్రకృతి ప్రసాదించిన ఒక పవిత్రమైన కానుకను భగవంతుడికి అర్పించడం. ఇందులో భక్తి, వినయం, సమర్పణ భావం ప్రధానమైనవి. ఇదే మాసంలో తులసీ ఆరాధనకు ప్రత్యేక స్థానం ఉంది. విష్ణుభక్తి సంప్రదాయంలో తులసిని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. కార్తికంలో శ్రీమహావిష్ణువుకు తులసీదళాలతో పూజచేయడం విశేష ఫలప్రదమని పురాణాలు పేర్కొన్నాయి. తులసి ప్రాశస్త్యం కేవలం పూజా విధానానికే పరిమితం కాదు. భారతీయ గృహ సంస్కృతిలో తులసి అత్యంత పవిత్రమైన జీవన సంప్రదాయం. కార్తిక మాసంలో తులసీ కల్యాణం ముఖ్యమైన వేడుక. తులసీ అమ్మవారికి, శ్రీమహావిష్ణువు స్వరూపమైన శాలగ్రామం లేదా శ్రీకృష్ణుడితో వివాహం జరిపిస్తారు. ఈ వేడుక వెనక ఉన్న పురాణగాథ బృందాదేవి చరిత్రతో అనుసంధానమై ఉంటుంది. శివభక్తి గొప్పదా, విష్ణుభక్తి గొప్పదా అనే భేదం లేకుండా కార్తిక దామోదరుడుగా విష్ణువును, రుద్రుడుగా పరమేశ్వరుని కొలుస్తాం. ఈ అద్వైత తత్వాన్ని లోకానికి చాటిచెప్పడంలో భాగంగా హరిహరసుతుడైన అయ్యప్పను ఈ మాసంలోనే విశేషంగా పూజిస్తారు. అటు శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం కలిగిన ఈ కార్తిక మాసంలో నదీస్నానం, దేవతార్చనం, సత్య నారాయణ వ్రతం, దీపారాధన, దీపదానం మొదలైనవి నియమనిష్ఠలతో ఆచరించిన వారికి అక్షయ సంపదలు, సకల శుభాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. తెల్లవారుజామున నదీస్నానం మొదలు సాయంత్రం ప్రమిద వెలిగించే వరకు, తులసి కోట నుంచి శివాలయం వరకు, బిల్వ దళం నుంచి ఉసిరి వృక్షం వరకు ప్రతి ఆచారంలోనూ ఒక విశ్వాసం ఉంది. ప్రతి విశ్వాసం వెనకా ఒక తాత్విక భావన నిగూఢంగా కనిపిస్తుంది. ఒక చిన్న ప్రమిదలో విశ్వతత్వం, ఒక తులసీదళంలో భక్తి పరిమళం, బిల్వపత్రంలో శివ రహస్యం.. ఇలా ప్రతీ ఆచారం వెనక అంతరార్థం.. అదే కార్తిక మాస రహస్యం. ఇక్కడ దీపం వెలుగు మాత్రమే కాదు.. జ్ఞానానికి ప్రతిరూపం, చెట్టు కేవలం వృక్షం కాదు జీవనాధారం, నది కేవలం ప్రవహించే నీరు కాదు జీవన సంస్కృతి. ఈ సమస్త ప్రకృతిలో ఒకే పరమతత్వాన్ని దర్శించడమే భారతీయ ఆధ్యాత్మికతలోని అంతరార్థం. అలాంటి ప్రకృతి ఆరాధనకు, అంతరంగ సాధనకు, దైవ చింతనకు ఒక ప్రత్యేకమైన వేదిక కార్తిక మాసం.

ద రేడియన్స్ వార్ సీజన్ 2 టాలెంట్ కం ఫ్యాషన్ షోకు మొదలైన సెలక్షన్స్

హైదరాబాద్ ఫ్యాషన్,డిజిటల్,మీడియా రంగాలలో అత్యంత అనుభవజ్ఞురాలైన ప్రముఖ యాంకర్ హాసిని వర్మ ఆధ్వర్యంలో స్కైల్ ప్రొడక్షన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ది రేడియన్స్ వార్ సీజన్ 2 టాలెంట్ కం ఫ్యాషన్ షో కు సెలక్షన్స్ మొదలయ్యాయని షో నిర్వాహకురాలు హాసిని వర్మ తెలియజేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్,ఎర్రగడ్డలోని జనప్రియ మెట్రోపాలిస్ క్లాసిక్ హోమ్స్ గ్రౌండ్స్ లో సెలక్షన్ వేదుక నిర్వహించారు. కార్యక్రమానికి రాచరికం మూవీ డైరెక్టర్ సురేష్,ప్రముఖ మోడల్, యాక్టర్ రూపేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హాసిని వర్మ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో తమ మొదటి ది రేడియన్స్ వార్ సీజన్ వన్ ను సారధి స్టూడియో వేదికగా నిర్వహించామని అప్పుడు తమ షోకు అద్భుతమైన ఆదరణ లభించింది అన్నారు.ఇప్పుడు 2026 లో తిరిగి తమ సీజన్ 2 ను ప్రారంభించామని షో ఫినాలే డిసెంబర్ నెలలో నిర్వహించబోతున్నామని అన్నారు.ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగం మీద మక్కువ గల యువతులు,మహిళలు అనేక కేటగిరీలలో పోటీపడ్డారు. సెలక్షన్స్ ఇంకా కూడా కొనసాగుతాయని ఫ్యాషన్ రంగం అంటే అభిమానం ఉన్న యువతులు మహిళలు తమ స్కైల్ ప్రొడక్షన్స్ ని సంప్రదించవచ్చు అని వారు తెలియజేశారు.సెలక్షన్ వేదుకలలో మాధవి కొల్ల,పావని రెడ్డి,నేహా,దివ్,మానస,మనీషా,రామ్ మల్లె తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జేఎన్‌టీయూలో విషాదం

హాస్టల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- హాస్టల్ భవనం నాలుగో అంతస్తు నుంచి దూకి బలవన్మరణం
- పరీక్షలో ఫెయిల్ కావడంతోనే మనస్తాపం చెందినట్లు అనుమానం
- మృతుడు ఖమ్మం జిల్లా వాసి విక్రమ్ బాబుగా గుర్తింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కేపీహెచ్‌బీ పోలీసులు

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) క్యాంపస్‌లో విషాదం చోటుచేసుకుంది. ఓ బీటెక్ విద్యార్థి హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లిలోని గౌతమ్ బాయ్స్ హాస్టల్‌లో నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడిని ఖమ్మం జిల్లాకు చెందిన విక్రమ్ బాబు (19)గా గుర్తించారు. ఇతను జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అర్ధరాత్రి హాస్టల్ భవనం నాలుగో అంతస్తుపై నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన విక్రమ్ బాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హాస్టల్ అధికారులు వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని, ఘటనకు దారితీసిన పూర్తి కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థి మృతితో క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి

ఆస్తులపై ఏసీబీ దాడులు

అక్రమ ఆస్తుల ఆరోపణలపై 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు..

రంగారెడ్డి మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణికి ఏసీబీ అధికారులు షాక్ ఇచ్చారు. ఆదాయానికి మించి ఆస్తులుకూడబెట్టారన్న ఆరోపణలతో హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లోని 8ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. గతంలో రూ.75 వేల లంచం కేసులో వాణితో పాటు సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె నివాసంతో పాటు స్థిరాస్తులు, ప్లాట్లు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సోదాల్లోబయటపడిన ఆస్తుల విలువపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

రూ.5 కోట్ల కోసం నకిలీ సీబీఐ అధికారుల అవతారం..

రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్!



4 రోజుల్లోనే కేసు ఛేదనమదనపల్లెలో సంచలనం సృష్టించిన కిడ్నాప్ కేసును పోలీసులు నాలుగు రోజుల్లోనే ఛేదించారు. నకిలీ సీబీఐ అధికారులుగా అవతారమెత్తిన ఓ ముఠా రియల్ ఎస్టేట్ వ్యాపారి సాదిక్‌ను అపహరించి రూ.5 కోట్లు డిమాండ్ చేసింది.ఈ నెల 10న కారులో వెళ్తున్న సాదిక్‌ను అడ్డుకున్న నిందితులు నకిలీ సీబీఐ గుర్తింపు కార్డులు, వారెంట్ చూపించి కిడ్నాప్ చేశారు. అనంతరం కర్ణాటకలోని తుమకూరు ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి నిర్బంధించారు. రూ.5 కోట్లు ఇవ్వాలని బంధువులపై ఒత్తిడి తెచ్చి, రూ.26 లక్షలను తమ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు.కేసును సీరియస్‌గా తీసుకున్న మదనపల్లె పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ నెల 14న పీటీఎం చెక్‌పోస్టు వద్ద ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వ్యాపారి సాదిక్‌ను సురక్షితంగా రక్షించారు. బదిలీ అయిన రూ.26 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు.నిందితుల నుంచి రెండు నకిలీ సీబీఐ ఐడీ కార్డులు, డమ్మీ పిస్టల్, చేతి సంకెళ్లు, ఇన్నోవా క్రిస్టా కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఎల్కతుర్తి కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం



హన్మకొండ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేయాలి. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వేదికగా నిలవాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎల్కతుర్తి మండలంలో రోడ్లు, ఆసుపత్రి, కోర్టు, బస్టాండ్, 132 కేవీ సబ్‌స్టేషన్ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పనిచేయాలి. మండల కాంగ్రెస్ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల

నోటిఫికేషన్ విడుదల

- నవంబర్ 29న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ
- రెండో దశలో 4,960 సర్పంచ్, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- మొత్తం మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ



ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నవంబర్ 21న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన ఉంటుంది. తిరస్కరణకు గురైన అభ్యర్థులు 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ అప్పీళ్లపై 23న విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. గెలిచిన అభ్యర్థులతో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. ఏవైనా కారణాలతో పోలింగ్ నిలిచిపోతే, అవసరమైన చోట నవంబర్ 30న రీ-పోలింగ్ జరుపుతారు. రెండో విడతలో భాగంగా రాష్ట్రంలో 4,960 సర్పంచ్ పదవులకు, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలి విడత పోలింగ్ నవంబర్ 26న, మూడో విడత డిసెంబర్ 2న జరగనుంది. ఈ మూడు దశల్లో కలిపి మొత్తం 13,167 సర్పంచ్, 1.32 లక్షలకు పైగా వార్డు సభ్యుల స్థానాలను భర్తీ చేయనున్నారు.

శబరిమలలో ప్రారంభమైన వార్షిక మండల-మకరవిళక్కు యాత్ర

- మంగళవారం వేకువజాము నుంచే అయ్యప్ప దర్శనానికి భక్తుల అనుమతి
- రోజుకు 80 వేల మంది దర్శించుకునేలా ఆలయ బోర్డు ఏర్పాట్లు
- పంబ, సన్నిధానం వద్ద 5 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు
- తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది నుంచి భారీగా తరలివస్తున్న భక్తులు



శబరిమల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో రెండు నెలల పాటు సాగే వార్షిక మండల-మకరవిళక్కు యాత్ర మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. మలయాళ మాసం 'వృశ్చికం' మొదలవుతుండటంతో కొండపై 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణ మార్మోగుతోంది. ఈరోజు సాయంత్రం 4 గంటలకే ఆలయ ద్వారాలు తెరుచుకోనుండగా, మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తున్నారు. మొదటి రోజే స్వామివారిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో కొండ దిగువకు చేరుకున్నారు. కేరళతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. 41 రోజుల పాటు కఠిన దీక్ష ఆచరించిన స్వాములు నల్లటి వస్త్రాలు ధరించి, నేతి కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని తలపై మోస్తూ పంబానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం 18 మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకుని నేతి అభిషేకం నిర్వహించనున్నారు. మండల కాలంలో రోజుకు దాదాపు 80,000 మంది భక్తులకు దర్శనం కల్పించేలా తిరువాన్మూర్ దేవస్వం బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇందులో 60,000 మందికి వర్చువల్ క్యూ ద్వారా, మిగిలిన వారికి స్పాట్ బుకింగ్ కేంద్రాల ద్వారా దర్శన అవకాశం కల్పిస్తున్నారు. యాత్రికుల రాకతో శబరిమల గిరులు ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరుస్తున్నాయి.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

– నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు – శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



కడప:రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత ఎన్నికలకు సంబంధించి ఒంటిమిట్ట, సిద్దవటం, నందలూరు మండలాలలో కొనసాగుతున్న సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియను పురస్కరించుకుని, ఆయా నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడత ఎన్నికలు జరిగే అన్ని ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వెంట రాజంపేట డి.ఎస్పీవెంకట్రామయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి. రెడ్డెప్ప, ఒంటిమిట్ట సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఏపీకి మరో తుపాను గండం

- ఈ నెల 20న విశాఖ-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం
- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- తీవ్ర తుపానుగా మారి ఏపీ తీరం వైపు రాక
- కోస్తాంధ్ర, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- గంటకు 145 కి.మీ వేగంతో బలమైన గాలుల ముప్పు

ఏపీకి మరో తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి తీవ్ర తుపానుగా మారనుందని, ఇది ఈ నెల 20వ తేదీన విశాఖపట్నం–బాపట్ల మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రస్తుతం ఈ వాతావరణ వ్యవస్థ ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ఇది విశాఖపట్నానికి సుమారు 960 కిలోమీటర్ల దూరంలో ఉందని అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం (నవంబర్ 16) నాటికి తుపానుగా, మంగళవారం (నవంబర్ 17) నాటికి తీవ్ర తుపానుగా మారనుందని ఐఎండీ అంచనా వేసింది. ఆ తర్వాత ఇది ఏపీ తీరం వైపు పయనించనుంది. ఈ తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలోని పలు ప్రాంతాలతో పాటు రాయలసీమలోని కొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. కరుణసాగర్ తెలిపారు. తీర ప్రాంతాల్లో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, కొన్నిచోట్ల గాలి వేగం 110 నుంచి 145 కిలోమీటర్ల వరకు కూడా ఉండవచ్చని ఆయన వివరించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురవవచ్చని అంచనా వేస్తున్నారు. రానున్న గురు, శుక్రవారాల్లో ఉత్తరాంధ్ర తీర ప్రాంతాన్ని తీవ్ర తుపాను సమీపించనుందని, భారీ వర్షాలు, బలమైన గాలులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) కూడా హెచ్చరించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, తీరప్రాంత ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇటీవలే మురసు తుపాను రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో తాజా తుపాను హెచ్చరికలతో అధికార యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది.

పశ్చిమ బెంగాల్‌లో మరో ఎన్‌కౌంటర్..

- పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో ఘటన
- ఆయుధం రికవరీ చేస్తుండగా పోలీసులపై కాల్పులు
- ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామన్న పోలీసులు
- నేరగాళ్లకు రాష్ట్రంలో స్థానం లేదన్న సీఎం సువేందు అధికారి



బర్ధమాన్ పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై కాల్పులు జరిపిన కేసులో నిందితుడిగా ఉన్న హిస్టరీ షీటర్, పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. బీర్‌భూమ్ జిల్లా నానూర్‌లోని ఓ ఇటుక బట్టీ వద్ద ఆదివారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. రతన్ షేక్ అనే హిస్టరీ షీటర్‌ను అరెస్ట్ చేసేందుకు నవంబర్ 13న శాంతినికేతన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాయిక్ బజార్ వద్ద పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిందితుడు పోలీసులపై కాల్పులు జరపగా, కానిస్టేబుల్ బిశ్వజిత్ దాస్ ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. అనంతరం షేక్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన కానిస్టేబుల్‌ను మొదట బోల్‌పూర్ ఆసుపత్రికి, ఆ తర్వాత బర్ధమాన్ మెడికల్ కాలేజీకి తరలించారు. ఈ ఘటన తర్వాత పరారీలో ఉన్న రతన్ షేక్‌ను పోలీసులు ఆదివారం పక్కనే ఉన్న పుర్బా బర్ధమాన్ జిల్లాలోని నవాబ్‌హట్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. కానిస్టేబుల్‌పై కాల్పులకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకునేందుకు అతడిని నానూర్‌లోని ఇటుక బట్టీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దాచిపెట్టిన ఆయుధాన్ని బయటకు తీసిన షేక్, మరోసారి పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరపగా, షేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నానూర్‌లోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంత్ర గ్రామ నివాసి అయిన షేక్‌పై దొంగతనం, దోపిడీ, నార్కోటిక్స్ వంటి పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పందించారు. "పోలీసులపై ఎవరైనా కాల్పులు జరిపితే, వారికి పోలీసులు స్వీట్లు పంచాలా? రాష్ట్రంలో నేరగాళ్లకు స్థానం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన గత ఆరు నెలల్లో రాష్ట్రంలో ఇది ఐదో పోలీస్ ఎన్‌కౌంటర్ కావడం గమనార్హం.

నారాయణపేట మెడికల్ కాలేజీ

గర్ల్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం



నారాయణపేట నారాయణపేట మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ లో అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. కాలేజీ యాజమాన్యం ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకుని హాస్టల్‌గా నిర్వహిస్తోంది. అగ్నిప్రమాదంలో విద్యార్థినుల వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. దట్టమైన పొగతో కొందరు విద్యార్థినులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదర్కొన్నారు. హాస్టల్‌లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు కూడా అందుబాటులో లేవని స్టూడెంట్స్ అంటున్నారు. అదృష్టవశాత్తూ విద్యార్థినులందరూ క్షేమంగా బయటపడ్డారు. హాస్టల్‌లో భద్రతా ప్రమాణాలు, కనీస సౌకర్యాలపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీశైలంలోతగ్గిన నీటి నిల్వలు



శ్రీశైలం శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా తగ్గుతున్నాయి. 215.80 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 48.57 టీఎంసీల నీరు మాత్రమే నమోదమయింది. 885 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి ప్రస్తుతం 829.10 అడుగులు వుంది. కేవలం 9 రోజుల్లో 3.03 టీఎంసీల మేర నీటి నిల్వలు తగ్గాయి. రోజుకు సగటున 0.33 టీఎంసీల నీటి తగ్గుదల నమోదయింది. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి స్తంభించింది. హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం తాగునీటి అవసరాలకు జూలై వరకు నీటిని సరిపెట్టేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని అధికారులు అంచనా.

గిగ్ వర్కర్లపై కాంగ్రెస్ ప్రేమ

హైదరాబాద్ : హైదరాబాద్ మాదాపూర్‌లోని జయభేరి గ్రౌండ్స్ వేదికగా జరిగిన గిగ్ వర్కర్ల సమ్మేళనంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి గిగ్ , ప్లాట్‌ఫామ్ కార్మికులపై వరాల జల్లు కురిపించారు. గిగ్ వర్కర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా, వై–ఫై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలు కల్పిస్తామని, వారి కుటుంబాల విద్య, వైద్య బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఈ భారీ ప్రకటనలు గత ఎన్నికల ప్రచారంలోనూ చేశారు. మరి మూడేళ్లుగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గిగ్ వర్కర్లకు వాస్తవంగా అందిన ప్రయోజనాలేమిటన్న ప్రశ్న ఇప్పుడు బలంగా తెరపైకి వస్తోంది.తెలంగాణ విషయానికొస్తే, డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం కేవలం కాగితాలు, వాయిదాలకే పరిమితమైందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ఎన్నికల ముందు అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరిగింది. కనీసం కార్మిక శాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించడానికే ఏడాదిన్నర సమయం పట్టింది. ని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ఏప్రిల్ 2026లో గవర్నర్ ఆమోదం పొందిన తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల చట్టం జూన్ 2న లాంఛనంగా ప్రారంభమైనప్పటికీ, విధివిధానాలు ఖరారు కాకపోవడంతో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కార్మికులకు అందలేదు. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన కోసమే హడావుడిగా నిబంధనలు విడుదల చేశారే తప్ప, గత మూడేళ్లలో ప్రమాదాలకు గురైన వందలాది మంది డెలివరీ బాయ్స్ కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందిన భరోసా శూన్యం.మరోవైపు, 2023 మే నెలలో అధికారంలోకి వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. బెంగళూరు వంటి ఐటీ నగరంలో లక్షలాది మంది గిగ్ వర్కర్లు పనిచేస్తున్నప్పటికీ, అక్కడ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వానికి రెండేళ్లకు పైగా సమయం పట్టింది. ఆగస్టు 2025లో కర్ణాటక ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ బిల్లు ను ఆమోదించి, ఫిబ్రవరి 2026లో అగ్రిగేటర్ కంపెనీల నుంచి 1% నుంచి 5% వరకు సంక్షేమ రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో దాని అమలు నత్తనడకన సాగుతోంది. సంక్షేమ రుసుము వసూలు కోసం ఉద్దేశించిన పేమెంట్ అండ్ వెల్ఫేర్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ పోర్టల్ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కంపెనీలు స్వచ్ఛందంగా లెక్కలు చూపి డబ్బులు జమ చేయాలనే నిబంధన పెట్టడంతో, అగ్రిగేటర్ల నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం, కార్మికుల యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగడం విమర్శలకు తావిస్తోంది.రెండు రాష్ట్రాల కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుపై గిగ్ వర్కర్లలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆరు గ్యారంటీల అమలులోనే తడబడుతున్న తెలంగాణ ప్రభుత్వం, ఇప్పుడు గిగ్ వర్కర్ల కుటుంబాల విద్య, వైద్య బాధ్యతలను కూడా తీసుకుంటామని రాహుల్ గాంధీతో కొత్త హామీలు ఇప్పించడం కేవలం రాజకీయ ప్రచార ఆర్భాటం మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ప్రతిపక్ష నేతలు అంటున్నారు. అటు కర్ణాటకలోనూ, ఇటు తెలంగాణలోనూ అగ్రిగేటర్ కంపెనీల ఏకపక్ష ఐడీ బ్లాకింగ్‌లు , తక్కువ డెలివరీ ఛార్జీలు, కనీస వేతనాలపై ప్రభుత్వాలకు ఏమాత్రం నియంత్రణ లేకుండా పోయిందని, చట్టాలు చేసినా కంపెనీల ఒత్తిడికి ప్రభుత్వాలు తలొగ్గుతున్నాయని గిగ్ వర్కర్లు వాపోతున్నారు.

పునర్విభజన బిల్లుకు ఎన్సీపీ మద్దతు

ముంబై : పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయంలో ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే మద్దతు పలికారు. దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన కాకుండా, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల్లో సమానంగా ఫ్లాట్ ఫార్ములాతో 50 శాతం లోక్‌సభ స్థానాలను పెంచే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే తమ పార్టీ దానికి సానుకూలంగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన సొంత నియోజకవర్గమైన బారామతిని ఉదాహరణగా చూపుతూ?గతంలో 10?12 లక్షలుగా ఉన్న ఓటర్ల సంఖ్య నేడు 20?22 లక్షలకు పెరిగిందని, కేవలం రూ. 5 కోట్ల ఎంపీ నిధులతో ప్రతి గ్రామానికి న్యాయం చేయడం సాధ్యం కావడం లేదని, మెరుగైన పాలన కోసం నియోజకవర్గాల విభజన అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.అయితే, సుప్రియా సూలే ప్రకటనపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నుంచి భిన్నమైన స్పందన వ్యక్తమైంది. డీలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వాలనుకుంటే అది వారి పార్టీ వ్యక్తిగత నిర్ణయం కావొచ్చు, కానీ అందులో ఇండియా కూటమి లేదా కాంగ్రెస్ పేరును ప్రస్తావించవద్దు అని కాంగ్రెస్ స్పందించింది. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల పరిధిలోనే పునర్విభజన జరగాలని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. మరోవైపు, జులైలో కేంద్రం నిర్వహించిన సమావేశంలో సమానంగా 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన చర్చకు వచ్చిందని, అయితే ఇప్పటివరకు అధికారికంగా బిల్లు ముసాయిదా ఏదీ తమకు అందలేదని, తుది నిర్ణయం తీసుకునే ముందు కూటమి భాగస్వాములతో చర్చిస్తామని సుప్రియా సూలే వివరణ ఇచ్చారు.ఎన్డీఏ కూటమికి ఈ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదించుకోవడానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో సుప్రియా సూలే చేసిన ఈ వ్యాఖ్యలు ఎన్డీఏకు బలం చేకూర్చేలా ఉన్నాయి. ఇదే సమయంలో, రెండు ఎన్సీపీ వర్గాల విలీనంపై వస్తున్న ఊహాగానాలను ఆమె పూర్తిగా తోసిపుచ్చారు?తాము ఎన్డీఏలో చేరడం లేదని, విలీన చర్చలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నామని స్పష్టం చేశారు.

తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి 15 నుంచి 18 గంటల సమయం
- 31 కంపార్ట్‌మెంట్లలో స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు
- నిన్న రూ. 4.95 కోట్లుగా నమోదైన శ్రీవారి హుండీ ఆదాయం
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 82,173 మంది భక్తులు



తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం ఉదయం నాటికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనం కోసం సుమారు 15 నుంచి 18 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. వారాంతం కావడంతో భక్తులు తిరుమలకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. నిన్న ఒక్కరోజే 82,173 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వీరిలో 27,058 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ. 4.95 కోట్ల ఆదాయం సమకూరింది. అదేవిధంగా, ఆదివారం నాడు 4.21 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.59 లక్షల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగినట్లు అధికారులు తెలిపారు

టోలీ చౌకీరెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

– తప్పిన పెద్ద ప్రమాదం

హైదరాబాద్ టోలీ చౌకీలోని మండీ కింగ్ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం జరిగిందిజ ఆదివారం రాత్రి 11:30 గంటలకు 2వ అంతస్తులోని హోటల్ కిచెన్ చిమ్నీలో మంటలు చెలరేగాయి. 4, 5వ అంతస్తుల వరకు మంటలు వ్యాపించడంతో.. దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ప్రమాద సమయంలో.. 4, 5వ అంతస్తులలో పెద్ద సంఖ్యలో కస్టమర్లు వున్నారు. హోటల్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై.. కస్టమర్ల నుంచి బిల్లులు తీసుకోకుండా ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారా బయటకు తరలించారు. తరువాత గ్యాస్ సిలిండర్స్‌ను సురక్షిత ప్రాంతాలను తరలించి, మంటల్ని అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని యాజమాన్యం స్పష్టం చేసింది.

కేబినెట్‌లో మార్పులు తప్పవా...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగబోతోందనే చర్చ మళ్లీ ఊపందుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మంత్రివర్గంలో మార్పులు చేపట్టవచ్చనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో, మంత్రుల పనితీరు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, రాజకీయ సమీకరణాల ఆధారంగా కొత్త కూర్పు ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.డిసెంబర్ 2 నాటికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలతో పాటు సహకార సంఘాలు, సొసైటీల ఎన్నికలను కూడా జనవరి నెలలోగా ముగించాలని కూటమి నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రాజకీయ ప్రక్రియలు పూర్తయిన తర్వాత ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో పాలనపై కేంద్రీకరించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. డిసెంబర్ 12 నాటికి కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనను పూర్తి చేసుకోనుండటం కూడా ఈ చర్చకు ప్రాధాన్యతను పెంచుతోంది.మరోవైపు 2027 మార్చిలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో ఆలోపే మంత్రివర్గ మార్పులు ఉంటాయా? లేక బడ్జెట్ సమావేశాల తర్వాతే కొత్త కూర్పు ప్రకటిస్తారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. కేంద్ర మంత్రివర్గంలోనూ మార్పులు జరగవచ్చనే ప్రచారం ఉండటంతో జాతీయ స్థాయి రాజకీయ పరిణామాలు రాష్ట్ర కేబినెట్ కూర్పుపై ప్రభావం చూపవచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ లకు చెందిన మొత్తం 24 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన వారు 20 మంది కాగా, మిగిలిన స్థానాల్లో మిత్రపక్షాలకు ప్రాతినిధ్యం ఉంది. కొత్తగా మంత్రులైన వారికి మరో అవకాశం ఇవ్వాలా? సీనియర్లకు ప్రాధాన్యత కల్పించాలా? అనే అంశాలను నాయకత్వం పరిశీలించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈసారి మార్పుల్లో మంత్రుల వ్యక్తిగత పనితీరుతో పాటు వారి నియోజకవర్గాల్లో పార్టీ బలం కూడా కీలకం కానుంది. స్థానిక ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించని మంత్రులపై నాయకత్వం అసంతృప్తిగా ఉందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కు ఇంకా కొంత పట్టుందని భావిస్తున్న నేపథ్యంలో అక్కడ పార్టీని బలోపేతం చేయడానికి కొత్త ముఖాలకు అవకాశం కల్పించవచ్చనే అంచనాలున్నాయి. కడప జిల్లాకు మంత్రివర్గంలో మరింత ప్రాధాన్యత కల్పించే అవకాశంపైనా చర్చ జరుగుతోంది.ఉత్తరాంధ్ర ప్రాంతంలోనూ కొన్ని మార్పులు ఉండవచ్చనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో ఆశించిన రాజకీయ ఆధిక్యం సాధించకపోవడం, పొత్తుల విషయంలో సమన్వయ లోపాలు వంటి అంశాలు కొందరు మంత్రులకు ప్రతికూలంగా మారవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాంతానికి చెందిన నలుగురు మంత్రుల్లో ఇద్దరి స్థానాలు మారవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయిమొత్తంగా నలుగురి నుంచి ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది మంత్రుల వరకు మార్పులు ఉండవచ్చనే చర్చ సాగుతోంది. అయితే ఇప్పటివరకు దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. కేవలం రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చల ఆధారంగా తుది నిర్ణయాన్ని అంచనా వేయలేం. ఎన్నికల సమీకరణాలు, పాలనా సామర్థ్యం, సామాజిక సమతూకం మధ్య చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ మార్పులు నిజమైతే ఏపీ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేచినట్లే.

తిరుమలలో వైభవంగా శ్రీవారి పుష్పయాగం.. పుష్పాల ఊరేగింపు!



శ్రీవారి పుష్పయాగం సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పుష్పయాగం కోసం దాతలు సమర్పించిన 9 టన్నుల పుష్పాలను ప్రత్యేక పూజలతో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువచ్చారు.

కౌతాళం గ్రామ అభివృద్ధే లక్ష్యంగా

సొసైటీ చైర్మన్ అడుగులు

- టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా నాగమణి
- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కౌతాళం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం అల్లూరి నాగమణి ఎంపిక చేసింది. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకురాలిగా, రైతు సంఘము కార్యదర్శి గా,సొసైటీ చైర్మన్ గా వెంకటపతి రాజు మంచి గుర్తింపు ఉంది. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండే నాయకురాలిగా తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారం, రహదారుల అభివృద్ధి, పారిశుధ్యం, అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన ఇనపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం సర్పంచ్ అభ్యర్థిగా మా సతీమణి నాగమణి కు అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామ ప్రజలు నన్ను ఆదరించి నట్టే మా సతీమణి కు ఆశీర్వదించాలని మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. అని కోరారు.రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ, కౌతాళం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాను. అని అన్నారు మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపిస్తాను" అని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి అంకితభావం.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకత్వం. గ్రామ ప్రజల ఆశీస్సులు, ఆదరణతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని ఆకాంక్షించారు.బీజేపీ జిల్లా అధ్యక్షులు, రాజానంద్, లింగేష్, గొట్టయ్య, గిరి,రమేష్, తదితరులు ప్రచారం లో పాల్గొన్నారు.

సమీక్షలతో సరా...

ప్రజల్లో భరోసా ఎప్పుడు

విజయవాడ : వైసీపీ భవిష్యత్తు మరియు వైఎస్ జగన్ నాయకత్వంపై రాజకీయ విశ్లేషకుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆలస్యం చేస్తే పార్టీ మరింత బలహీనపడు తుందని కొందరు విశ్లేషకులు భావిస్తుండగా, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు పెరుగుతోందని వైసీపీ వర్గాలు వాదిస్తున్నాయి. వైసీపీ అధినేతగా జగన్ కార్యకర్తలకు, నేతలకు నిత్యం అందుబాటులో ఉండాల్సి ఉంది. నేతలకు నిరంతరం దిశానిర్దేశం చేస్తూ ఉండాలి. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, హెచ్చరికలతో సరిపెట్టకుండా తాను కూడా భాగస్వామి అవుతున్నానన్న ఆలోచన నేతల్లో కల్పించాలి. అంతే తప్ప నెలలో రెండు రోజులపాటు తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సమీక్షలు జరపడం వల్ల ఒరిగేదేమీ లేదని అంటున్నారు. అదే జిల్లాలకు వచ్చి నేతలు, కార్యకర్తలతో సమావేశమైతే జగన్ తమ వద్దకు వస్తున్నారని, తప్పు చేస్తే మిగిలిన వారు ఫిర్యాదు చేస్తారన్న భయం నేతలలో ఉంటుందని అంటున్నారు. అలా చేయకుండా కేవలం నియోజకవర్గ ఇన్ ఛార్జులతోసమావేశమైతే ప్రయోజనం ఉండదని మరికొందరు సూచిస్తున్నారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ఓటమి తర్వాత క్యాడర్‌కు సరైన భరోసా ఇవ్వడంలో నాయకత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కార్యకర్తలు ఇంకా బయటకు రావడం లేదు. క్షేత్రస్థాయి నిర్మాణం లోనూ కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. పార్టీని తిరిగి పునర్నిర్మించాలంటే స్థానిక సమస్యలపై నిరంతర పోరాటం, బలమైన స్థానిక నాయకత్వం అవసరమని పలువురు సూచిస్తున్నారు. వచ్చే ఏడాది ఎటూ తాను పాదయాత్ర నిర్వహిస్తాను కదా? అని జగన్‌అనుకుంటే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని వైసీపీ అభిమానులు అంటున్నారు. పాదయాత్ర లో జగన్ అందరినీ కలవలేరు. అయితే జిల్లాలకు వెళ్లి సమీక్షలను నిర్వహించడం ద్వారా చాలా వరకూ ప్రయోజనం ఉంటుంది. అంతే తప్ప పాదయాత్ర తోనే అంతా సాధ్యమవుతుందని, అంతా సెట్ అవుతుందని భావిస్తే మళ్లీ బూమ్ రాంగ్ అయితే అది జగన్ తప్పిదమే అవుతుందని కొందరు వాదిస్తున్నారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓటు శాతం పెరిగిందని భావించడం ఒకరకంగా క్యాడర్ లోనూ, లీడర్లలోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంచడం కోసమే తప్ప ఆ ఓటింగ్ శాతం సాధారణ ఎన్నికల వరకూ నిలబడే అవకాశం ఉండదు. ఎందుకంటే గతంలో జరిగిన పరిణామాలు ఇందుకు ఉదాహరణ. 2021 లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అద్భుతమైన విజయం సాధించినా, 2024 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమి పాలయిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత మరియు అక్రమాల ఆరోపణలను అనుకూలంగా మలచుకోవాల్సి ఉంటుంది. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలు, దౌర్జన్యాలను తట్టుకుని తమ క్యాడర్ కసితో పోరాడిందని జగన్ జబ్బలు చరుచుకున్నా వారికి అవసరమైన సాయం అందించేలా పార్టీ ముందుకు రావాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కార్యకర్తలకు అండగా నిలబడేలా "వైఎస్ జగన్ 2.0" తరహా నాయకత్వాన్ని అందిస్తానని జగన్ ప్రకటించారు.

అలాగే స్థానిక ఎన్నికల్లో పనితీరు సరిగా లేని సుమారు 60 మంది నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లపై చర్యలు తీసుకునే అంశంపై ఆయన సీరియస్‌గా సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జగన్ తక్షణమే క్షేత్రస్థాయి మార్పులు చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపకపోతే పార్టీకి ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తుండగా, ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని వైసీపీ అధిష్ఠానం ధీమా వ్యక్తం చేస్తోంది

12 లక్షల కోట్ల పెట్టుబడుల లెక్కలు సరే..

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖపట్నం వేదికగా విజయవంతంగా ముగిసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో జరిగిన ఈ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో సుమారు రూ. 12.14 లక్షల కోట్ల విలువైన 141 అవగాహన ఒప్పందాలు , 2.46 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుబడుల ప్రతిపాదనలు ఖరారయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది సదస్సులో కుదిరిన ఒప్పందాల కొనసాగింపుగా, ఈసారి కూడా గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ, రక్షణ మరియు తయారీ రంగాల్లో పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం తన మార్క్ చూపించింది.అయితే, పెట్టుబడుల సదస్సుల్లో కుదిరే లక్షల కోట్ల ఒప్పందాలు ప్రకటించిన వెంటనే గ్రౌండింగ్ కావనేది ఆర్థిక రంగంలో అందరికీ తెలిసిన వాస్తవం. గణాంకాల పరంగా రూ. 12 లక్షల కోట్ల అంకెలు ఎంత ఆకర్షణీయంగా కనిపించినా, అందులో కనీసం సగం శాతం పెట్టుబడులు నిర్దిష్ట గడువులోపు వాస్తవ రూపం దాల్చి, ఫ్యాక్టరీలు వెలిసి, స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తేనే అది నిజమైన విజయం . పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ అడుగు ముందుకు వేస్తోందనడానికి ఈ సదస్సులు, ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ వంటి విధానాలు నిదర్శనంగా నిలుస్తున్నప్పటికీ, కాగితాలపై ఉన్న ఒప్పందాలను క్షేత్రస్థాయిలో ఫలితాలుగా మార్చడం ప్రభుత్వానికి అసలైన సవాలు.ఇక అన్నింటికంటే ముఖ్యమైన ప్రశ్న?ఈ భారీ పెట్టుబడుల లెక్కలు, జీడీపీ గణాంకాలు అధికార కూటమికి రాజకీయంగా ఓట్లు తెచ్చిపెడతాయా? భారతీయ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, స్థూల ఆర్థిక వ్యవస్థ పరుగులు, లక్షల కోట్ల కార్పొరేట్ ఒప్పందాలు సాధారణ ఓటరు నాడిని నేరుగా ప్రభావితం చేయలేవని స్పష్టమవుతోంది. సగటు మధ్యతరగతి వ్యక్తికి, రైతుకు, కూలీకి వేల కోట్ల అంకెలతో సంబంధం ఉండదు. వారి రోజువారీ జీవితంలో ప్రభుత్వం వల్ల ఏమైనా ఇబ్బంది కలిగిందా లేదా, ధరలు అదుపులో ఉన్నాయా, స్థానిక పాలన సజావుగా సాగుతోందా అన్న అంశాలే ఓటింగ్ తీర్పును శాసిస్తాయి. 2004లో హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చి, ప్రపంచ స్థాయి పెట్టుబడులు తెచ్చినప్పటికీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాలేకపోవడం, అలాగే ఇండియా షైనింగ్ నినాదం ఉన్నప్పటికీ నాడు వాజ్‌పేయి ప్రభుత్వం ఓటమిపాలవడం ఈ సత్యానికి బలమైన ఉదాహరణలు. పారిశ్రామిక ప్రగతి దీర్ఘకాలంలో రాష్ట్రానికి మేలు చేసినప్పటికీ, తక్షణ ప్రజాసమస్యలు, సంక్షేమ ఫలాలు, స్థానిక ప్రజాప్రతినిధుల పనితీరులో లోపాలు తలెత్తితే ప్రజల్లో వ్యతిరేకత పెరగడం సహజంఈ కోణంలో చూస్తే.. లక్షల కోట్ల పెట్టుబడుల గురించి ప్రభుత్వం అతిగా ప్రచారం చేసుకోవడం కంటే, క్షేత్రస్థాయిలో సామాన్యుడికి అసౌకర్యం కలగకుండా పాలన సాగించడంపైనే ఎక్కువ దృష్టి పెట్టడం రాజకీయంగా మంచిదన్న అభిప్రాయం ఉంది. ఎందుకంటే, రూ. 12 లక్షల కోట్లు వచ్చాయి అని ప్రభుత్వం పదేపదే ప్రచారం చేసినప్పుడు, క్షేత్రస్థాయిలో నిరుద్యోగికి ఉద్యోగం కనిపించక పోయినా లేదా నిత్యావసరాల భారం తగ్గకపోయినా ఆ ప్రచారమే ప్రభుత్వంపై విమర్శలకు ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. విశాఖ సీఐఐ సదస్సు ద్వారా పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం కలిగించడంలో ఏపీ ప్రభుత్వం విజయం సాధించింది. కానీ ఆ ఆర్థిక విజయాన్ని రాజకీయ విజయంగా మలచుకోవాలంటే.. ఒకవైపు కుదిరిన ఒప్పందాల్లో కనీసం 50 శాతం వేగంగా గ్రౌండింగ్ అయ్యేలా పర్యవేక్షిస్తూనే, మరోవైపు సామాన్యుడి రోజువారీ జీవితంలో ప్రభుత్వం పట్ల సానుకూలత పెరిగేలా క్షేత్రస్థాయి పాలనను పరుగులు పెట్టించాల్సిన అవసరం ఉంది.

రాజమండ్రి అనంతపురం ఎవరిదో

రాజమండ్రి : రాజమండ్రి నగర పాలక సంస్థ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. ఎస్సీ జనరల్ కేటగిరీకి రిజర్వు చేసిన ఈ స్థానం నుంచి అధికార, ప్రతిపక్షాలు నువ్వానేనా అన్నట్లు తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. కూటమి తరపున బీజేపీ మేయరు రేసులో నిలబడుతోందని అంటున్నారు. ఆ పార్టీ అభ్యర్థిగా మాజీ కార్పొరేటర్ రేలంగి శ్రీదేవి పేరు దాదాపు ఖరారైందని అంటున్నారు. ఇదే సమయంలో వైసీపీ తరపున కార్పొరేషన్ మాజీ ఉద్యోగి బర్రె కొండబాబు పేరు ప్రచారంలో ఉంది. అయితే బీజేపీ అభ్యర్థి శ్రీదేవి పేరు పట్ల కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన టీడీపీ సానుకూలంగా లేదన్న టాక్ ఎక్కువగా ఉంది. ఆమెకు బదులుగా డాక్టర్ పిడుగు విజయకుమార్ పేరును సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సిఫార్సు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. దీంతో కూటమిలో అభ్యర్థి ఎంపికపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్న ప్రచారం ఊపందుకుంది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నిక రసవత్తరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పల్లెల్లో మొదలైన సందడి రాష్ట్రంలో రెండో విడత మున్సిపల్ సంగ్రామానికి తెర లేచింది. ఈ నెల 26న నాలుగు కార్పొరేషన్‌లతోపాటు 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో రెండు చోట్ల జనసేన, ఒక చోట టీడీపీ, మరోచోట బీజేపీ పోటీకి దిగుతున్నాయి. శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లు జనసేన, మంగళగిరి-తాడేపల్లి నుంచి టీడీపీ పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. రాజమండ్రిపై బీజేపీ ఎప్పుడో కర్చీఫ్ వేసింది. కేంద్ర మాజీ మంత్రి పురందరేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమండ్రి పార్లమెంటు పరిధిలో ఉన్న ఈ కార్పొరేషన్ దక్కించుకోవాలని ఎప్పటి నుంచో బీజేపీ పావులు కదుపుతోంది. అయితే ఆ పార్టీకి సంస్థాగతంగా పెద్దగా బలం లేదన్న ఆలోచనతో విపక్షం ఈ స్థానంపై గట్టిగా ఫోకస్ చేసింది. ఇదే సమయంలో అభ్యర్థి ఎంపికలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే ప్రచారంతో వైసీపీలో ఆశలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. నాలుగు కార్పొరేషన్లలో రాజమండ్రి తప్ప మరెక్కడా అభ్యర్థుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు లేవని చెబుతున్నారు. మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్ లో కూటమి బలంగా ఉందన్న ప్రచారం ఎక్కువగా ఉంది. అదే సమయంలో కాకినాడలో కూడా జనసేన, టీడీపీ సంస్థాగతంగా బలంగా ఉన్నారని చెబుతున్నారు. దీంతో ఈ రెండు కార్పొరేషన్లపై కూటమి ప్రత్యర్థులు పెద్దగా ఫోకస్ చేయడం లేదని అంటున్నారు. అదే సమయంలో శ్రీకాకుళంలో కూటమిలో విభేదాల కారణంగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరడం, ఆమె మేయరుగా పోటీకి దిగుతుండటంతో అక్కడ ఎన్నిక రసవత్తరంగా మారిందని చెబుతున్నారు.

మూడు రాష్ట్రాల మధ్య రైల్వే లైన్..

శ్రీకాకుళం : ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఏపీ మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న 173.61 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్‌కు పోలవరం జలాశయం ముంపు సమస్య ఎదురైంది. ఏపీలోని పోలవరం జిల్లా పరిధిలో 65 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత మార్గం ముంపు ప్రాంతంలోకి వస్తున్నట్లు గుర్తించడంతో ఎలైన్‌మెంట్ మార్చేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. మార్గం మారితే కొత్త స్టేషన్లు, టన్నెల్స్ నిర్మించాల్సి రావడంతో రూ.2,864 కోట్ల ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశముంది.ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న కొత్త రైల్వే లైన్‌కు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతం అడ్డంకిగా మారింది. ఈ మార్గంలోని సుమారు 65 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ముంపు పరిధిలో ఉన్నట్లు భూసేకరణ సమయంలో అధికారులు గుర్తించారు. దీంతో ప్రతిపాదిత రైల్వే మార్గం మార్చేందుకు రైల్వే శాఖ క్షేత్రస్థాయిలో మరోసారి సర్వే చేపట్టింది. ముంపు గ్రామాలకు ఎగువన అనువైన మార్గాన్ని గుర్తించే పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. సర్వే నివేదికను త్వరలో రైల్వే బోర్డుకు పంపించనున్నారు.మల్కన్‌గిరి నుంచి భద్రాచలం, పాండురంగాపురం వరకు 173.61 కిలోమీటర్ల పొడవున పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాల మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మించేందుకు రైల్వే శాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ మార్గంలో ఒడిశాలోని మల్కన్‌గిరితోపాటు బడలి, పనిమట, రాజన్‌గూడ, లచ్చిపేట, కందపల్లి, మోటు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట, తెలంగాణలోని భద్రాచలం, సారపాకలో స్టేషన్లు ప్రతిపాదించారు. చివరగా పాండురంగాపురం స్టేషన్ వద్ద ప్రస్తుతం ఉన్న డోర్నకల్-భద్రాచలం రోడ్-మణుగూరు రైల్వే లైన్‌కు ఈ మార్గాన్ని అనుసంధానించనున్నారు. ఈ లైన్ అందుబాటులోకి వస్తే మూడు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెరగనుంది.ఈ రైల్వే లైన్ ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా పరిధిలో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల మీదుగా సుమారు 65 కిలోమీటర్ల మేర ప్రయాణించనుంది. ఈ మార్గంలోనే కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట స్టేషన్లు ప్రతిపాదించారు. అయితే రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టగా.. ప్రతిపాదిత మార్గంలో అధిక భాగం పోలవరం జలాశయం ముంపు పరిధిలో ఉన్నట్లు వెల్లడైంది. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మొత్తం 65 కిలోమీటర్లలో అత్యధిక భాగం ముంపు ప్రాంతంలోకి వస్తున్నట్లు స్పష్టమైంది.ఈ సమస్యపై రైల్వే అధికారులు పలుమార్లు పోలవరం జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు. అయితే ఇప్పటికే ప్రతిపాదించిన మార్గాన్ని యథాతథంగా కొనసాగించడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రత్యామ్నాయ మార్గంపై దృష్టి సారించారు. పోలవరం జలాశయం ముంపునకు గురయ్యే గ్రామాల పరిధిని పరిగణనలోకి తీసుకుంటూ.. వాటికి ఎగువన ఏ ప్రాంతం నుంచి రైల్వే లైన్ నిర్మించవచ్చనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇందుకోసం కొత్తగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే దాదాపు తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే నివేదికను రైల్వే బోర్డుకు పంపనున్నారు మల్కన్‌గిరి-భద్రాచలం-పాండురంగాపురం రైల్వే లైన్ నిర్మాణానికి తొలుత రూ.2,864 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే పోలవరం జిల్లా పరిధిలో ఎలైన్‌మెంట్ మార్పు అనివార్యం కావడంతో ప్రాజెక్టు వ్యయంలోనూ మార్పులు వచ్చే అవకాశం ఉంది. గతంలో ప్రతిపాదించిన స్టేషన్ల స్థానంలో కొత్త ప్రాంతాల్లో స్టేషన్లు నిర్మించాల్సి రావచ్చు. ప్రత్యామ్నాయ మార్గంలో కొన్ని చోట్ల సొరంగాలు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. వీటికి అదనపు నిధులు అవసరమవుతాయి. మరోవైపు ఈ రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దఎత్తున అటవీ భూములు అవసరం కానున్నాయి. దీంతో అటవీ అనుమతులు, భూసేకరణ, కొత్త ఎలైన్‌మెంట్ ఖరారు వంటి అంశాలు ప్రాజెక్టు పురోగతిలో కీలకంగా మారనున్నాయి.



పంచాయితీ పోరు...

నువ్వా, నేనా అన్నట్టు సాగుతున్న పోరు



కర్నూలు ఏపీలో అర్బన్ బాడీస్ కి అలాగే పరిషత్తులకు ఎన్నికలు పూర్తి అయిపోయాయి. టీడీపీ కూటమి మంచి ఆధిక్యాన్ని కనబరచింది. వైసీపీ అయితే నైతిక విజయం తమదని చెప్పుకుంది. ఈ నేపథ్యంలో ఏపీ వ్యాప్తంగా 13 వేలకు పైగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు మూడు విడతలలో జరగబోతున్నాయి. ఈ నెల 26, 29, డిసెంబర్ 2 తేదీలలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే రాజకీయ పార్టీల ప్రమేయం ఏ మాత్రం లేని ఎన్నికలు ఇవి. అయితే పేరుకు ఇలా అనుకోవడం తప్ప పార్టీల మద్దతుతో నాయకులు పోటీకి దిగుతారు. దాంతో కనిపించీ కనిపించని రాజకీయ సమరం పల్లెలలో సాగుతుంది.ఇదిలా ఉంటే టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్య నాయకులతో తాజాగా నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో అయితే పల్లెలలోనూ విజయ ధంకా మోగించాలని గట్టిగా కోరారు. అంతే కాదు మునిసిపల్,పరిషత్తు ఎన్నికల్లో సాగించిన ప్రభంజనం కొనసాగించాలని సూచించారు. గతం కంటే పాతిక శాతం ఓటు బ్యాంక్ స్థానిక ఎన్నికల్లో కూటమికి వచ్చిందని బాబు చెప్పారు. అందువల్ల పల్లెలలో కూడా అదే జోరు సాగాలని ఆయన అన్నారు. ఈవీఎంలు అయినా బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్ లోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారని బాబు గుర్తు చేశారు.ఇంకో వైపు వైసీపీ కూడా ఏకగ్రీవాలు వద్దు అని తమ పార్టీ నేతలకు స్పష్టం చేసింది. పల్లెలలో బలంగా ఉన్న నాయకులను పోటీకి నిలపాలని వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. తప్పనిసరిగా ప్రతి స్థానానికి పోటీ చేసి తీరాల్సిందే అని అన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానానికి పార్టీ మద్దతుదారులు తప్పనిసరిగా పోటీ చేయాలని పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశించినట్లు సజ్జల తెలిపారు. అదే విధంగా అభ్యర్థుల ఎంపికలో ఆర్థిక స్తోమత కంటే స్థానిక ప్రజాబలం రిజర్వేషన్ నిబంధనలు నాయకత్వ లక్షణాలు, ప్రచార సామర్థ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.పల్లెలల్లో జరిగే ఎన్నికలు పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరగనప్పటికీ క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేస్తాయని చెప్పారు. అందువల్ల భవిష్యత్ ఎన్నికలకు సిద్ధం కావడానికి ఇవి ఎంతో కీలకమని సజ్జల పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అధికార కూటమి నేతలు, పోలీసులు, అధికారులను ఉపయోగించి నామినేషన్లు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఆటంకం కలిగించారని ఆయన ఆరోపించారు. అయినా సరే పార్టీ శ్రేణులు ఎక్కడా వెనక్కి తగ్గకుండా ఫలితాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామంలో బలమైన పోటీ ఇవ్వాలని సజ్జల పిలుపునిచ్చారు పంచాయతీలలో సర్పంచ్ పదవి అంటే ఎంతో కీలకమైనది. దాంతో ఈ పదవుల కోసం పార్టీలు మద్దతు ఇచ్చిన వారిని గెలిపించుకోవాలని చూస్తాయి. పల్లెల నుంచే నాయకత్వం వస్తుందని నమ్ముతాయి. రేపటి సార్వత్రిక ఎన్నికలకు కూడా ఈ ఎన్నికలే కీలకంగా భావిస్తాయి. ఈ నేపథ్యంలో పల్లెలలో జరిగే పోరు మరోసారి ఆసక్తిని పెంచనుంది. ఢీ అంటే ఢీ అనే వాతావరణం కనిపించనుంది. మరి వేల పంచాయతీలలో సాగే ఈ రాజకీయ కురుక్షేత్రం కడు రసవత్తరం అని అంటున్నారు.

జేఎన్‌టీయూహెచ్ హాస్టల్‌లో విషాదం..

సెమిస్టర్‌లో ఫెయిల్ అయ్యాడన్న మనస్తాపంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) వసతి గృహంలో ఒక ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. మృతుడిని 19 ఏళ్ల రాజా విక్రమ్ బాబుగా గుర్తించారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఖమ్మం ప్రాంతానికి చెందిన ఉపేంద్ర కుమారుడైన విక్రమ్ బాబు, కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు.విశ్వవిద్యాలయంలోని గౌతమ్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న అతను, సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇదే కారణంతో అతను ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది.అర్ధరాత్రి దాటిన తర్వాత హాస్టల్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ప్రాథమిక వివరాలు సేకరించగా, పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

సైలెంట్‌గా లోకేష్



విజయవాడ : వచ్చే అధ్యక్షుడు నారా లోకేషేనని తరచుగా వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తుంటారు. అయితే.. ఇలాంటి వాటికి తాజాగా సీఎం చంద్రబాబు చెక్ పెట్టారు. పార్టీలో వారసత్వ రాజకీయాలు లేవని స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలే అసలైన బలమని, నాయకత్వ అవకాశాలు కేవలం సామర్థ్యం, ప్రజాదరణ ఆధారంగానే దక్కుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై తాను క్లారిటీతోనే ఉన్నానని ఆయన చెప్పుకొచ్చారు. రెండో విడత మున్సిపోల్స్ లో ఆసక్తికర పరిణామం వాస్తవానికి ప్రస్తుతం మంత్రిగా ఉన్న నారా లోకేష్ విషయంలో కేవలం వారసత్వం వల్ల కాకుండా, ఆయనకున్న సానుకూలతలు, క్షేత్రస్థాయిలో చేసిన కృషి ఆధారంగానే పార్టీలో అవకాశాలు దక్కుతున్నాయి. 2014 ఎన్నికల సమయంలో ఐటీడీపీని క్షేత్రస్థాయిలో నడిపి.. పార్టీకి వెన్నెముకగా మారారు. ముఖ్యంగా వస్తున్నా మీ కోసం పాదయాత్ర సమయంలో క్షేత్రస్థాయి కేడర్‌ను తెరవెనుక ఉండి నడిపించారు. ఫలితంగా పార్టీ విజయ తీరాలకు చేరింది. దీనికి ప్రతిఫలంగానే ఆయనకు ఎమ్మెల్సీ, అనంతరం మంత్రి పదవి దక్కాయి. ఇక, పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీని నమ్ముకుని పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పే చంద్రబాబు నిజంగానే ఆ పని చేస్తున్నారు. నమ్మకంతో నడిచే పార్టీ నేతలకు ప్రధానంగా పదవులు ఇస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగల్లా మాధవి పార్టీలో చేరిన మూడేళ్ల కాలంలోనే పొలిట్ బ్యూరో పదవిని దక్కించుకున్నారు. ఇక, లోకేష్ విషయానికి వస్తే.. పార్టీ అధ్యక్ష పగ్గాలు తీసుకుంటారన్న ప్రచారం ఉన్నా.. ఇప్పట్లో కాదన్న సంకేతాలను చంద్రబాబు ఇస్తున్నారు. ఆయన పుంజుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో కేంద్రం సహా రాష్ట్ర రాజకీయాలపై పట్టు పెంచుకునేలా ఆయనను ప్రోత్సహిస్తున్నారు. పార్టీ కేవలం ఎన్నికల కోసమే కాకుండా భవిష్యత్ తరాల కోసం పనిచేస్తుందని, యువతకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్న చంద్రబాబు ఇదే కోణంలో నారా లోకేష్‌ను కూడా తీర్చిదిద్దుతున్నారు. ఏదేమైనా వారసత్వం ముసుగులో పార్టీ పగ్గాలు అప్పగించేది లేదన్న విషయాన్ని చంద్రబాబు తేల్చేయడంతో విమర్శలకు అడ్డుకట్ట పడిందని అంటున్నారు.విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఉపాసన కామినేని కొణిదెల మధ్య జరిగిన ప్రత్యేక ప్యానల్ చర్చ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచింది. యంగ్ ఆంధ్ర ? థ్రైవింగ్ ఆంధ్ర అనే అంశంపై సాగిన ఈ ఇంటరాక్టివ్ సెషన్ ఆద్యంతం ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా సాగడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ, తాను ఒక రాక్‌స్టార్ మినిస్టర్ పక్కన కూర్చున్నానని నారా లోకేష్‌ను అభినందించడం సభలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని నింపింది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే ఏపీకి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడంలో నారా లోకేష్ కనబరుస్తున్న చొరవను ఉపాసన ప్రత్యేకంగా కొనియాడారు.పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన విధానాలతో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఆయన

కృష్ణగారి కోపం అలా ఉండేదట!



వెండితెరను దశాబ్దాల పాటు ఏలిన కథానాయకులలో కృష్ణ ఒకరు. పల్లెటూరి మొనగాడు .. కార్మిక నాయకుడు .. వంటి పాత్రలలో ఆయనకి తిరుగులేదని చెప్పుకునేవారు. తెలుగు సినిమాకి మరింత భారీతనాన్ని తెచ్చిన కృష్ణ గురించి ఎవరిని అడిగినా, ఆయన దేవుడిలాంటి మనిషి అనే చెబుతారు. ఆయన వ్యక్తిత్వాన్ని గురించిన అనేక విషయాలను వెల్లడిస్తారు. అలా నిర్మాత శాఖమూరి మల్లికార్జున్ 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కృష్ణ గురించి ప్రస్తావించారు. ఆయన గురించిన తనకి తెలిసిన విషయాలను పంచుకున్నారు. "అప్పట్లో కృష్ణగారు – రాఘవేంద్రరావుగారి కాంబినేషన్ అంటే ఆ సినిమా సూపర్ హిట్ అని చెప్పుకునేవారు. అయితే దాసరి గారు అన్నాగానీ కృష్ణగారికి ఎంతో అభిమానం ఉండేది. కృష్ణగారు 'దేవదాసు' సినిమాను తీసిన సమయంలో అక్కినేనికి .. ఆయనకి మధ్య వార్ నడిచేదనే ప్రచారం జరిగింది. కానీ వాళ్లిద్దరూ ఎప్పటి మాదిరిగానే మాట్లాడుకునేవారు. ఆ తరువాత కూడా వాళ్లు కలిసి నటించారు. కృష్ణగారి కోపం ఆ గంట .. ఆ పూట మాత్రమే. ఆ తరువాత ఆ విషయాన్ని ఆయన మరిచిపోతారు" అని చెప్పారు. "కృష్ణ గారు చాలా గొప్ప వ్యక్తి. ఆయనకి ఎవరితోనూ ఎలాంటి శత్రుత్వం ఉండేది కాదు. అప్పట్లోనే ఎక్కువ మల్టీస్టారర్ సినిమాలు చేసింది కృష్ణగారే. 'గంగ మంగ' కథ విన్న తరువాత ఏ పాత్ర వేస్తారని అడిగితే, శోభన్ బాబు సెలెక్ట్ చేసుకునే పాత్ర కాకుండా మిగిలిన పాత్రను తాను చేస్తానని చెప్పారు. అలా ఆయన చాలా బోల్డ్ గా చెప్పేవారు. మనసులో ఏమీ పెట్టుకునేవారు కాదు. ఆయనకి ఎన్టీఆర్ పట్ల గౌరవం .. అక్కినేని పట్ల అభిమానం .. శోభన్ బాబుగారి పట్ల సోదర ప్రేమ ఉండేవి" అని అన్నారు.

ఇంట్లో దెయ్యం ఉందని భయపడిన శృతి హాసన్

కదిలే బొమ్మతో వణికిపోయా అంటూ షాకింగ్ కామెంట్స్!




దెయ్యాలు, ఆత్మలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయా? లేవా? అనే ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. పారానార్మల్ యాక్టివిటీస్ గురించి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కథలు, అనుభవాలు ప్రచారంలో ఉన్నాయి. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కొందరు తమ జీవితాల్లో ఎదురైన వింత సంఘటనలను పలు సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా ఈ జాబితాలో స్టార్ హీరోయిన్ శృతి హాసన్ కూడా చేరారు. తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన భయానక అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ బొమ్మ తనకు నిద్రలేని రాత్రులను మిగిల్చిందని, చివరకు దాన్ని ఇంటి నుంచి బయటకు పంపించాల్సి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తనకు ఎదురైన వింత అనుభవం గురించి శృతి హాసన్ మాట్లాడుతూ.. చెన్నైలోని తన ఇంట్లో కొన్ని సందర్భాల్లో ఏవో అదృశ్య శక్తులు ఉన్నట్లు అనిపించేదని చెప్పారు. అయితే ప్రతిసారీ ఇలాంటి అనుభవాలు ఎదురుకాలేదని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వింత సంఘటనలు జరిగేవని వెల్లడించారు.తన దగ్గర మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి ఫియోనా అని పేరు పెట్టుకున్నానని తెలిపారు. తన స్నేహితులు ఇంటికి వచ్చినప్పుడు కూడా ఆ బొమ్మను పలకరించేవారని చెప్పారు. అంతేకాకుండా ఆ బొమ్మను అల్మారాలో పెట్టి దానిపై రకరకాల బొమ్మలు గీస్తూ ఉండేవారట. మొదట్లో అదొక సాధారణ బొమ్మగానే భావించినప్పటికీ, ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు తనను తీవ్రంగా భయపెట్టాయని శ్రుతి వివరించారు. ఆ బొమ్మ విషయంలో తనకు ఎదురైన అత్యంత భయానక అనుభవాన్ని కూడా శ్రుతి హాసన్ వెల్లడించారు. ఎవరు ముట్టుకోకుండానే, ఎవరూ కదిలించకుండానే ఆ బొమ్మ ఒక చోటు నుంచి మరో చోటుకు మారిపోయేదని చెప్పారు. తాను దాన్ని ఒకచోట పెట్టిన తర్వాత మళ్లీ మరోచోట కనిపించడంతో చాలా ఆశ్చర్యపోయేదాన్నని తెలిపారు. ముఖ్యంగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఇలాంటి సంఘటనలు ఎదురవడంతో తనకు భయం మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఆ బొమ్మను ఎవరు కదుపుతున్నారు? అసలు అది ఒకచోటు నుంచి మరోచోటుకు ఎలా వెళ్తోంది? అనే విషయాలు తనకు అర్థమయ్యేవి కావని చెప్పారు. ఈ సంఘటనలు తనలో భయాన్ని పెంచడంతో ఇంట్లో ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఆ బొమ్మ కారణంగా భయాందోళనలకు గురైన తాను చివరకు ఆ భయాన్ని తగ్గించుకోవడానికి ఆధ్యాత్మిక మార్గాన్ని ఆశ్రయించినట్లు శ్రుతి తెలిపారు. ఇంట్లో హనుమాన్ చాలీసా ప్లే చేసేదాన్నని, చేతిలో ఉప్పు పట్టుకుని ప్రార్థనలు చేసేదాన్నని చెప్పారు. ఇంట్లో ఏదో నెగిటివ్ ఎనర్జీ ఉన్నట్లు అనిపించడంతో దాన్ని తొలగించుకోవడానికి ప్రయత్నించానని వెల్లడించారు.

అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ బొమ్మ విషయంలో తన భయం తగ్గకపోవడంతో చివరకు దాన్ని ఇంటి నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారట. అందులో భాగంగా ఆ బొమ్మను పూర్తిగా విడదీసి, దాని భాగాలను ఇంటి నుంచి బయటకు పంపించేశానని శ్రుతి వెల్లడించారు. బొమ్మను ఇంటి నుంచి తొలగించిన తర్వాత కూడా తనకు మనశ్శాంతి కలగాలని భావించి ఇంట్లో కొన్ని పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రుతి హాసన్ చెప్పారు. ఆ తర్వాత ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. తన జీవితంలో జరిగిన ఈ సంఘటనలు అచ్చం ఓ హారర్ సినిమాలో చూసినట్లుగా అనిపించాయని పేర్కొన్నారు. శృతి హాసన్ చెప్పిన ఈ అనుభవం ప్రస్తుతం అభిమానులతో పాటు నెటిజన్లలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ధనుష్ సినిమాలు వదిలేయొద్దు

స్టేజ్‌పైనే ఎమోషనల్ రిక్వెస్ట్ చేసిన సాయి పల్లవి



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారా? దళపతి విజయ్ బాటలోనే పయనిస్తూ సినిమాలకు గుడ్‌బై చెప్పనున్నారా? ప్రస్తుతం తమిళ సినీ ఇండస్ట్రీలో ఈ అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ధనుష్ రాజకీయ రంగ ప్రవేశంపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ధనుష్ నటించిన 'ఓం' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ సాయి పల్లవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ధనుష్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు హాజరైన సాయి పల్లవి వేదికపై ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి వస్తున్న సమయంలో రహదారుల వెంట కనిపించిన జెండాలను చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. అక్కడి వాతావరణం చూస్తుంటే సినిమా వేదుకకు వచ్చినట్లు కాకుండా, ఓ భారీ రాజకీయ సభకు వచ్చినట్లు అనిపించిందని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో ఆడిటోరియం మొత్తం అభిమానుల కేరింతలు, ఈలలతో మార్మోగిపోయింది. ఆ తర్వాత ధనుష్‌ను ఉద్దేశించి సాయి పల్లవి చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. "సర్.. మీరు జీవితంలో ఏం చేసినా, ఏ రంగంలోకి వెళ్లినా మీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను. కానీ నాలోని నటిగా మీకు ఒక చిన్న రిక్వెస్ట్ చేస్తున్నాను. ఇప్పటికే విజయ్ సర్ రాజకీయాల్లోకి వెళ్లి సినిమాలకు దూరమయ్యారు. అది సినీ పరిశ్రమకు తీరని లోటు. కనీసం మీరు మాత్రం సినిమాల్లో కొనసాగాలని కోరుకుంటున్నాను అంటూ ఎంతో ఎమోషనల్‌గా మాట్లాడారు. మంచి కథలకు ప్రాణం పోసే ధనుష్ లాంటి ప్రతిభావంతమైన నటులు సినీ పరిశ్రమకు ఎంతో అవసరమని సాయి పల్లవి అభిప్రాయపడ్డారు.

ఆయన కూడా సినిమాలకు దూరమైతే ప్రేక్షకులు ఓ అద్భుతమైన నటుడిని కోల్పోవాల్సి వస్తుందని తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఆమె చేసిన ఈ విజ్ఞప్తికి అక్కడున్న అభిమానులు పెద్ద ఎత్తున చప్పట్లతో మద్దతు తెలిపారు. ప్రస్తుతం సాయి పల్లవి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ధనుష్ అభిమానులు సైతం ఆమె వ్యాఖ్యలతో ఏకీభవిస్తూ, తమ అభిమాన హీరో సినిమాల్లోనే కొనసాగాలని కోరుకుంటున్నారు. అయితే ధనుష్ రాజకీయాల్లోకి వస్తారనే వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. మరి భవిష్యత్తులో ధనుష్ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తారా? లేక రాజకీయాల వైపు అడుగులు వేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

'హార్ట్స్ అక్రాస్ ది సీ'.. ఓ సాహసయాత్ర



రిట్జ్ ఆర్ట్ హౌస్ -- అమెరికా నిర్మించిన యానిమేటెడ్ లఘుచిత్రం 'హార్ట్స్ అక్రాస్ ది సీ'. డాక్టర్ అపర్ణ వొల్లూరు రాసిన మూలకథ, పాత్రల ఆధారంగా ఆంటోనియా ఆండ్రియాజ్జో స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ షార్ట్ ఫిల్మ్ ప్రీమియర్ ఆదివారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ఈ ప్రీమియర్‌కి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ లఘుచిత్రం నిడివి 24 నిమిషాల 48 సెకన్లు. తక్కువ సమయంలోనే ఎక్కువ సంతోషాన్ని పంచే స్క్రిప్ట్ ఇది. అమెరికాలోని ఒరెగాన్ ప్రాంతంలో నివసించే ఓ బీహార్ కుటుంబం, వారి స్నేహితులు కలిసి 'వ్యాలీ హార్ట్' అనే నౌకలో చేపట్టే సముద్రయాత్ర చుట్టూ ఈ కథ సాగుతుంది. ఇటలీలోని వెరోనా నగరాన్ని చూడాలన్న భార్య కలను నిజం చేసేందుకు భర్త చేసే ప్రయత్నమే ఈ లఘుచిత్రమని మేకర్స్ తెలిపారు. స్నేహం, ధైర్యం, అనుకోని సవాళ్లు, పరస్పర సహకారంతో సాగే ఈ సాహసయాత్ర ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇస్తుందని వారన్నారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

విభిన్న కథాంశంతో 'ఛప్రి'



బండి సరోజ్ కుమార్ స్వీయ రచన, దర్శకత్వంలో నటిస్తూ.. ప్రమోద్ పడమటి, పృథ్వీ చౌహాన్‌లతో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'ఛప్రి'. ఐశ్వర్య బోరా, దివ్య జ్యోతి, శ్లోకా, ప్రవీణ్, మోహన్ ఆర్య, జీవా బాలచందర్, ప్రియాంక సింగ్ కీలకపాత్రధారులు. శనివారం ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది.బండి సరోజ్‌కుమార్ మాట్లాడుతూ '700రోజులు కష్టపడి ఈ కథ రాశాను. కథకు తగ్గట్టుగా పటిష్టమైన స్క్రీన్‌ప్లే రాసుకున్నాను. చిత్రీకరణలో టీమ్ అంతా అండగా నిలిచారు. సమ్మర్‌లో సినిమాను విడుదల చేయబోతున్నాం' అని తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: రమేశ్ మర్రెపల్లి, నిర్మాణం: బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్.

అమేజింగ్‌గా 'ది మేజ్'



హీరో శ్రీరామ్ నటిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'ది మేజ్'. ప్రియాంక, ప్రాతిక శ్రీనివాస్, కమల్ కామరాజు కీలకపాత్రధారులు. డాక్టర్ రవికిరణ్ గడలాయ్ దర్శకుడు. డాక్టర్ ఉదయ్ కె.రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్, డాక్టర్ భరత్‌రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్‌రెడ్డి సోమ నిర్మాతలు. త్వరలోనే సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రముఖ దర్శక,నిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ 'ఇటీవల కాలంలో నేను చేసిన క్వాలిటీ సినిమా ఇది. కథ విన్నప్పుడు టెక్నికల్‌గా చెప్పినట్టు తీయడం కష్టం అనిపించింది. దాంతో ఓ డెమో షూట్ చేసి చూపించారు. నేను నిజంగా షాక్. ఇండస్ట్రీలో కొన్నాళ్లపాటు కొనసాగేంత మంచి దర్శకుడు రవికిరణ్ అనిపించింది. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

రామాయణం బాక్సాఫీస్ సునామీ.. సెకండ్ సండే రూ.75 కోట్ల వసూళ్లు,ధురంధర్ 2 రికార్డు బద్దలు!



బాక్సాఫీస్ వద్ద 'రామాయణం పార్ట్ 1' ప్రభంజనం కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ విజువల్ వండర్ కలెక్షన్ల విషయంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవిగా, రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటించిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీపావళి పండుగ సందర్భంగా విడుదలైన ఈ సినిమా మొదటి వారంలోనే భారీ వసూళ్లు సాధించగా, రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా రెండో ఆదివారం నమోదైన కలెక్షన్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలోనే 'ధురంధర్ 2' పేరిట ఉన్న సెకండ్ సండే రికార్డును కూడా రామాయణం అధిగమించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం.ద'రామాయణం' సినిమా రెండో వారాంతంలోనూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటుకుంది. నవంబర్ 15, ఆదివారం ఈ చిత్రం భారతదేశంలో సుమారు రూ.75 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు శనివారం నమోదైన రూ.72.90 కోట్లతో పోలిస్తే ఆదివారం కలెక్షన్లు మరింత పెరగడం విశేషం. సాధారణంగా సినిమాలకు మొదటి వారాంతం తర్వాత వసూళ్లు తగ్గుతుంటాయి. కానీ 'రామాయణం' విషయంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. రెండో ఆదివారం కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రావడంతో ఈ సినిమా మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. రెండో ఆదివారం అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో 'రామాయణం' సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ విషయంలో 'ధురంధర్ 2' సాధించిన రూ.68 కోట్ల వసూళ్ల రికార్డుగా ఉన్నాయి. అయితే రామాయణం రెండో ఆదివారం రూ.75 కోట్లు సాధించినట్లు వచ్చిన గణాంకాలతో ఆ రికార్డు బద్దలైంది. దీంతో రెండో ఆదివారం అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల జాబితాలో రామాయణం అగ్రస్థానానికి చేరినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రెండో వారంలోనూ కలెక్షన్లు పెరుగుతుండటం ఈ సినిమా బాక్సాఫీస్ బలాన్ని తెలియజేస్తోంది. 'రామాయణం' సినిమా వసూళ్ల జోరు ఇతర భారీ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లపై కూడా ప్రభావం చూపిస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రం భారత్‌లో సుమారు రూ.760.60 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలో షారుఖ్ ఖాన్ నటించిన 'జవాన్' రూ.643.87 కోట్ల లైఫ్‌టైమ్ నెట్ కలెక్షన్లను అధిగమించింది. అలాగే రాజ్‌కుమార్ రావ్ నటించిన 'స్త్రీ 2' రూ.625.27 కోట్లు, విక్కీ కౌశల్ 'ఛావా' రూ.601.57 కోట్లు, షారుఖ్ ఖాన్ 'పఠాన్' రూ.544.28 కోట్లు, రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' రూ.556.36 కోట్ల వసూళ్లను కూడా దాటేసినట్లు సమాచారం. ఒకే సినిమాతో ఇన్ని భారీ చిత్రాల రికార్డులను అధిగమించడం ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారింది.

గ్లోబల్ మైండ్స్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





జిల్లాలగూడ(ప్రశ్న న్యూస్).గ్లోబల్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో అన్ని బ్రాంచీలలో బాలల దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ వినోద కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్లోబల్ మైండ్స్ విద్యాబోధనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాల నిర్వహణలోనూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వేడుకలను విజయవంతం చేసిన అన్ని బ్రాంచీల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు.?అలాగే, గత విద్యా సంవత్సరంలో ఎస్?ఎస్?సీ పరీక్షల్లో 580 మార్కులు సాధించిన విద్యార్థికి రూ.10,000 నగదు పురస్కారం అందించిన అల్కాపురి సాయిబాబా ట్రస్ట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ నట్టం నాగేంద్ర చౌధరి, ఏజీఎం, అన్ని బ్రాంచీల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీశైలం అన్న ప్రసాద వితరణ కేంద్రానికి 1500 కేజీలు పచ్చళ్ళు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి కర్నూలుకు చెందిన రైలు తేజేశ్వర్ అలాగే హైదరాబాద్ వాస్తవ్యులు కొలను నరేందర్ రెడ్డి ముద్దగౌని చంద్రశేఖర్ రెడ్డి 3,6000 వేల రూపాయలు,విలువ గల,1000 కేజీలు మామిడికాయ, పండుమిర్చి 500 కేజీలు అన్నదానం వితరణ కేంద్రం ఏఈఓ హరియా నాయక్ కి పర్యవేక్షకురాలు కోమలి గుమస్తా చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు

టియుడబ్ల్యూజే హెచ్143 జాతీయ, రాష్ట్ర కౌన్సిలకు ఎంపికైన పటాన్ చెరు జర్నలిస్టులు



పటాన్ చెరు(ప్రశ్న న్యూస్) తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్) – 143 యూనియన్ జాతీయ కౌన్సిల్, రాష్ట్ర కౌన్సిల్‌కు ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు వివిధ హోదాలకు ఎంపికయ్యారని యూనియన్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ కౌన్సిల్ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు ఆనంద్ కుమార్, ప్రమోద్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు వడ్ల శ్రీధర్, కొంక రాజ్ కిషోర్ బాబులు ఎంపికయ్యారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యులు జర్నలిస్టుల హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.పటాన్ చెరు నియోజకవర్గ జర్నలిస్టులకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవకాశం కల్పించడం పట్ల యూనియన్ పటాన్ చెరు నియోజకవర్గ అధ్యక్షులు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంతారం మహేష్ గౌడ్, టెంజు అధ్యక్షులు శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ లు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన సభ్యులకు శు భాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్తూ యూనియన్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. తమ ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ గారికి, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ లకు,టెంజు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు అంతం లేదా?

- ఏపీ రాప్తాడు, తెలంగాణ జూలూరుపాడు ఘటనలపై ఏఎండిఆర్ ఫౌండేషన్ ఆదిల్ ఆగ్రహం

- మహిళలు, విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి...

- నేరస్థులకు కఠిన శిక్షలు పడాలి

- ప్రతి ఆడపిల్ల భద్రత కోసం లక్షల గొంతులు ఒక్కటవ్వాలి



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో మహిళలు, బాలికలు, విద్యార్థినులపై వరుసగా జరుగుతున్న దాడులు, హత్యలు, అఘాయిత్యాలపై ఏఎండిఆర్ ఫౌండేషన్ ఆదిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాప్తాడులో పాఠశాల విద్యార్థిని హత్య, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో నర్సింగ్ విద్యార్థిని హత్య ఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

చట్టాలున్నా తగ్గని అఘాయిత్యాలు

మహిళలు, బాలికల రక్షణ కోసం కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ నేరాలు ఎందుకు తగ్గడం లేదని ఆదిల్ ప్రశ్నించారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారుల నుంచి కళాశాల విద్యార్థినుల వరకు ఎవరికీ భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వేగవంతమైన విచారణ.. కఠిన శిక్షలు

మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసుల విచారణను వేగవంతం చేసి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందించాలని కోరారు. అవసరమైతే చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి న్యాయ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కళ్ల ముందు సాక్ష్యాధారాలున్నప్పటికీ విచారణ పేరిట జరుగుతున్న జాప్యం, న్యాయ వ్యవస్థలో ఉన్న చిన్నపాటి వెసులుబాటు లను ఉపయోగించుకుని నేరస్తులు తప్పించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

ఆడపిల్లలను కాదు.. నేరస్థులను ప్రశ్నించాలి

ఆడపిల్లల భద్రత అనేది ఒక కుటుంబానికో, ఒక ప్రాంతానికో సంబంధించిన సమస్య కాదని, ఇది సమాజం మొత్తం బాధ్యత అని ఆదిల్ పేర్కొన్నారు. బాధితులనే ప్రశ్నించే ధోరణికి స్వస్తి పలికి, నేరస్థులను నిలదీయాలని అన్నారు. ప్రతి ఆడపిల్ల భయంలేకుండా చదువుకునే, స్వేచ్ఛగా జీవించే వాతావరణం కల్పించేందుకు ప్రజలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలకు భద్రత కల్పించలేని అభివృద్ధికి అర్థం లేదని, ఆడపిల్లల రక్షణ కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలని ఆదిల్ స్పష్టం చేశారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టులను వినియోగించి త్వరితగతిన శిక్షలు వేయడం ద్వారా భవిష్యత్ లో ఇలాంటి ఘటనలకు పాల్పడాలనే ఆలోచన చేసేవాళ్లకు కూడ ఒక హెచ్చరిక చేయాలన్నారు.

అగర్వాల్ రబ్బర్ కార్మికుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

ప్రతి కార్మికుడికి పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత

పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అగర్వాల్ రబ్బర్ పరిశ్రమ గేట్ వద్ద బిఆర్టియు జెండా ఆవిష్కరణ



పటాన్చెరు(ప్రశ్న న్యూస్) పటాన్చెరు పరిధిలోని అగర్వాల్ రబ్బర్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు.. వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు, అగర్వాల్ రబ్బర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం అగర్వాల్ రబ్బర్ పరిశ్రమ ఎదుట ఏర్పాటు చేసిన బిఆర్టియు జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి.. ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. జెండాను ఆవిష్కరించారు. అనంతరం పరిశ్రమ ఎండి అమిత్ అగర్వాల్ తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక నేపథ్యం నుండి రాజకీయాల్లోకి వచ్చిన తనకు ప్రతి కార్మికుడి కష్ట నష్టాలు తనకు తెలుసునని అన్నారు. అగర్వాల్ రబ్బర్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి చట్టపరంగా రావలసిన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు.. ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలు సైతం అందిస్తామని తెలిపారు. పరిశ్రమ అభివృద్ధిలోనూ కార్మికులు కీలక పాత్ర పోషించాలని కోరారు. విధి నిర్వహణల ఎటువంటి సమస్యలు తలెత్తిన.. తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బిఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి, అగర్వాల్ రబ్బర్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి యాదవ్, రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కార్మిక నాయకులు మధుసూదన్ రావు, అశోక్ రాజ్, సత్తయ్య, ఏడుకొండలు, ధర్మ రావు, కమృద్దీన్, విజయ్ కుమార్, పాణిగ్రాహి, రాజు, సింగ్, నరసింహ, శివ కుమార్, రవి, బాల రాజేష్, మల్లేష్, పాండా, రాజేంద్ర, నాగరాజు, సాహు, సంజీవ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ముందు ఆశ వర్కర్ల ధర్నా

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

బి ఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో మరింత ఉద్యమిస్తామని బి ఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ హెచ్చరించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రతి ఆశా వర్కర్‌కు రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేస్తూ బీ ఆర్ టీ యు, సీఐటీయూ యూనియన్లు ఆశ వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంబు ప్రభాకర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల విజయానికి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు సేవలు అందించడం, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో నిరంతరం కష్టపడుతున్నప్పటికీ వారికి ఇప్పటికీ కనీస వేతన భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఆశా వర్కర్లతో ప్రభుత్వం అనేక రకాల పనులు చేయించుకుంటూ పారితోషికాలు మాత్రమే చెల్లిస్తోందని, ఎంత కష్టపడి పనిచేసినా అనారోగ్యం, ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు కనీస ఆర్థిక భద్రత కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రెండవ పీఆర్సీని అమలు చేయాలని, ప్రతి ఆశా వర్కర్‌కు రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని, పదవీ విరమణ సమయంలో రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, చివరి వేతనంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని తదితర డిమాండ్లను చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్షుడు అశోక్, నరేష్, రేవతి, మా లక్ష్మి, పద్మ, సుధాకర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి విద్యాబోధనలో డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రాధాన్యత ను విద్యార్థుల అందించాలి





పాపన్నపేట (ప్రశ్న న్యూస్) పాపన్నపేట మండలంలోని పిఎన్ చేరుపల్లి పిఎస్ నాగసానిపల్లి లోని పాఠశాలలను జడ్పిహెచ్ఎస్ కొడపాక కాంప్లెక్స్ గెజిటెడ్ హెడ్మాస్టర్ కొండవీటి ఆరోగ్యం పాఠశాల లను పరిశీలించారు . విద్య బోధనలో జరుగుతున్న మార్పులను విద్యాబోధనలో డిజిటలైజేషన్ ప్రక్రియ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు విద్యాబోధనలో జరుగుతున్నటువంటి మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ విద్యాబోధనలో మెరుగైనటువంటి అంశాలను విద్యార్థి స్థాయిలో అర్థమైనటువంటి రీతిలో విద్యార్థులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో ఛత్ పూజ వేడుకల్లో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి

కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ దేవాలయంలో ఛత్ పూజ సందర్భంగా ఉత్తర భారత నాగరిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఛత్ పూజ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగురింత పారిజాత పాల్గొన్నారు.ఛత్ పూజలో భాగంగా భక్తులు సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించి, సంప్రదాయ ప్రసాదమైన 'ఠేకువా'ను నివేదించారు. ఈ సందర్భంగా ఉత్తర భారత నాగరిక సంఘం ఛైర్మన్ ఎన్.కే. సింగ్ మల్‌రెడ్డి రాంరెడ్డి గారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి భక్తులకు ఛత్ పూజ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. భిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సంప్రదాయాలు, సంస్కృతులను గౌరవిస్తూ ఐకమత్యంతో పండుగలు జరుపుకోవడం మన సమాజంలోని సమైక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతీయ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావు , దేవాలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి , ఏఎంసీ మాజీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి , చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల రవీందర్ గౌడ్ , దేవాలయ మాజీ ధర్మకర్త తోకటి కిరణ్ , నాయకులు కారుకొండ శివ గా ఉత్తర భారత నాగరిక సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఈ 19 న ఛలో సిద్దిపేటకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్



కోహెడ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సారథ్యంలో అలింకో సహకారంతో కోహెడ మండల కేంద్రంలో వృద్ధులకు,దివ్యాంగులకు ఉచిత పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 19న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బారి బహిరంగ ఉన్నందున తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సారథ్యంలో కోహెడ మండలం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బారి సంఖ్యలో తరలి వెళ్ళేవిధంగా మండలంలోని సముద్రాల,మైసంపల్లి,కాచాపూర్, సి సి పల్లె గ్రామలలోని ఆయా గ్రామాల సర్పంచులు మరియు అధ్యక్షులు,సీనియర్ నాయకులతో మండలంలోని ఆయా గ్రామాల ఇంచార్జీలు బీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి మరియు దూలం శ్రీనివాస్ గౌడ్ మరియు ఆవుల మహేందర్ తో కలిసి సమావేశం నిర్వహించి సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి పేదవారికి ఇందిరమ్మ బీమాను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు,అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా చరిత్రలో నిలిచిపోయే విధంగా సుమారు నాలుగు లక్షల అరవై మూడు వేల మందికి నూతన పించన్లు పంపిణీ చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సారథ్యంలో మన కోహెడ మండలానికి దాదాపుగా ఏడు వందల మంది లబ్ధిదారులకు నూతన పించన్లు మంజూరు అయినట్లు తెలిపారు.కావున మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బారి సంఖ్యలో తరలి వచ్చి ప్రజా పాలన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బారి బహిరంగ సభను విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు.

రోడ్లు తవ్వడం.. వదిలేయడం

ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనా అధికారుల డ్యూటీ

- సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న రహదారులు
- కంకర పోసి రోడ్డు రోలర్ తిప్పకుండానే రోడ్డు నిర్మాణాలు
- నెలల తరబడి పనులు నిలిపివేత.. నిత్యం నరకయాతన అనుభవిస్తున్న ప్రజలు
- జోనల్ కమిషనర్ మంగతాయారుకు ఫిర్యాదులు చేసినా స్పందన కరువు
- డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణ ఏదీ.? ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ పట్టించుకునేదెప్పుడు.?



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలో రహదారుల దుస్థితి ప్రజలకు శాపంగా మారుతోంది. అభివృద్ధి పేరుతో రోడ్లను తవ్వడం, పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేయడం, నెలల తరబడి రహదారులను పూర్తి చేయకుండా కాలయాపన చేయడం ఇక్కడి ఇంజినీరింగ్ అధికారులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మెరుగైన రహదారులు అందించాల్సిన అధికారులు కనీస బాధ్యతను సైతం విస్మరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సాధారణంగా రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా తవ్వకాలు పూర్తయిన అనంతరం అవసరమైన మేరకు కంకర పోసి, రోడ్డు రోలర్‌తో చదును చేసి, పటిష్టంగా తయారుచేసిన తర్వాతే తారు రోడ్డు వేయాల్సి ఉంటుంది. కానీ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఈ విధానానికి తిలోదకాలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కంకర పోసి రోడ్డు రోలర్‌తో అసలు చదును చేయకుండానే పనులు చేపట్టడం, మరికొన్ని చోట్ల తవ్విన రోడ్లను అలాగే వదిలేయడం ఇంజనీరింగ్ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.నెలల తరబడి రోడ్లు పూర్తికాకపోవడంతో వాహనదారులు గుంతలు, కంకర రాళ్ల మధ్య ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. దుమ్ము, ధూళితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, చిన్నారులు, రోగులు రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటోంది.ఈ సమస్యలపై స్థానికులు పలుమార్లు సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. జోనల్ కమిషనర్ మంగతాయారుకు ఫిర్యాదులు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో కనీస మార్పు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించాల్సి ఉన్నప్పటికీ పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నియోజకవర్గ సమస్యలు ఎమ్మెల్యే పట్టించుకోరా.?

ఇక స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సైతం నియోజకవర్గంలోని రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆయన దృష్టికి వెళ్లడం లేదా.? వెళ్లినా ఎందుకు పరిష్కారం కావడం లేదు.? ఓట్లేసి గెలిపించిన ప్రజలను కేవలం వర్క్ బ్యాంకు గానే చూస్తున్నారా.? ప్రజల సమస్యలు తీర్చాలన్న చిత్తశుద్ధి లేదా.? నియోజకవర్గంలో ఎక్కడ సిసి రోడ్డు వేసిన నాణ్యత లేకున్నా ఎమ్మెల్యే స్పందించారా.? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

ప్రజాధనం వృధా చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం, నాణ్యతా లోపాలపై బాధ్యత ఎవరిది? కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ ఉన్నత అధికారులు ఎక్కడున్నారు.? రోడ్లు తవ్వి వదిలేయడమే అభివృద్ధా.? ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే అధికారుల లక్ష్యమా.? అన్న ప్రశ్నలకు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.ఇప్పటికైనా సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని రహదారుల పనులపై సమగ్ర తనిఖీలు చేపట్టి, అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేయించడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ధరల భారం..

కేరళలో రెస్టారెంట్ల సంక్షోభం

- హోటళ్లకు వెళ్లడం తగ్గించిన ప్రజలు!



తిరువనంతపురం (ప్రశ్న న్యూస్) కేరళలో ఆహార ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరడంతో అక్కడి హోటల్, రెస్టారెంట్ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశవ్యాప్త సగటు కంటే రాష్ట్రంలో ఆహార పదార్థాల ధరల పెరుగుదల ఎక్కువగా ఉండటం వల్ల సామాన్య ప్రజలు హోటళ్లలో తినడాన్ని భారీగా తగ్గించుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం సగటున 8.94 శాతంగా నమోదవగా, కేరళలో మాత్రం అది ఏకంగా 10.92 శాతానికి చేరుకుంది. ఈ రెండు శాతం వ్యత్యాసం నేరుగా హోటల్ వ్యాపారాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని కేరళ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. హోటళ్ల నిర్వహణకు నిత్యం పెద్దమొత్తంలో అవసరమయ్యే బియ్యం, ఉల్లిపాయలు, కూరగాయలు, వంట నూనెలు, కిరాణా సరుకులతో పాటు కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల ధరలు భారీగా పెరిగాయి. పెద్ద రెస్టారెంట్లతో పోలిస్తే చిన్న, మధ్య తరహా హోటళ్లు ఈ భారాన్ని తట్టుకోలేక సతమతమవుతున్నాయి. నిత్యావసరాల ఖర్చులు పెరుగుతున్నప్పటికీ ఆ భారాన్ని మెనూ ధరల రూపంలో కస్టమర్లపైకి బదిలీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ధరల భయంతో సాధారణ కుటుంబాలు హోటళ్లకు రావడం బాగా తగ్గించేశాయి. కేవలం పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో తప్ప బయట తినడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు జీవన వ్యయం పెరిగినందున హోటల్ సిబ్బంది జీతాలు పెంచాలని కోరుతుండటంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.
మెనూ ధరలను పెంచితే ఉన్న కస్టమర్లు కూడా పూర్తిగా దూరమవుతారని కేహెచ్ ఆర్ఏ నేతలు చెబుతున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. జయపాల్, ప్రధాన కార్యదర్శి ఎన్. అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ.. సామాన్యులకు అందుబాటు ధరల్లో ఆహారం లభించేలా చూడటంతో పాటు, హోటల్ పరిశ్రమ మనుగడ సాగించడానికి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కమర్షియల్ గ్యాస్‌పై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని, మార్కెట్లో కృత్రిమ ధరల పెరుగుదల, అక్రమ నిల్వలపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. హోటళ్లపై కేవలం యజమానులే కాకుండా వంటవారు, సరఫరాదారులు, రైతులు ఇలా లక్షలాది మంది ఉపాధి ఆధారపడి ఉన్నందున ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితులపై కేరళ పౌర సరఫరాల శాఖ స్పందిస్తూ, బియ్యం సహా ఇతర నిత్యావసర సరుకుల విషయంలో కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మార్కెట్లో ధరలు అదుపు తప్పితే గతంలో ఓనం పండుగ సమయంలో చేపట్టినట్లుగానే మార్కెట్లోకి అదనపు నిల్వలను విడుదల చేస్తామని పేర్కొంది. రాష్ట్రంలో అమలవుతున్న పటిష్టమైన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు.

రామోజీరావు జయంతి ఇకపై రాష్ట్ర పండుగ

- తొమ్మిది రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు అవార్డుల ప్రదానం



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, పద్మవిభూషణ్ స్వర్గీయ రామోజీరావు జయంతిని ఇకపై ప్రతి ఏటా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా 'రాష్ట్ర పండుగ'గా నిర్వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన తెలుగు జాతికి, రాష్ట్రానికి అందించిన నిరుపమాన సేవలను చిరస్మరణీయం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రామోజీరావు 90వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక 'రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ఈ మేరకు ప్రకటన చేశారు. విజయవాడలోని బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకాగా.. ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కె. రామ్మోహన్ నాయుడు, రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిజం, కళలు-సంస్కృతి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యూత్ ఐకాన్, విద్య-వైద్యం రంగాల్లో విశేష సేవలు అందించిన 9 మంది ప్రముఖులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు, రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్‌కు, వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రామోజీరావుతో తనకు 1980 నుంచి దాదాపు 45 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నేను తొలిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలో రామోజీరావు గారు నాతో ఒక స్పష్టమైన మాట చెప్పారు. 'నేను ప్రభుత్వంలో మీ నుంచి నా కోసం గానీ, నా మనుషుల కోసం గానీ ఏ పనీ అడగను. అలాగే మీరూ కూడా మా సంస్థ విషయంలో ఇది రాయాలనో, రాయకూడదనో, ఎవరినైనా బదిలీ చేయాలనో అడగొద్దు. మీరు ప్రజలకు మంచి చేస్తే 24 గంటలూ మీకు మద్దతుగా నిలుస్తా.. అదే తప్పు చేస్తే మాత్రం చాకిరేవు తప్పదు' అని నిర్మొహమాటంగా చెప్పారు. విలువలకు కట్టుబడి పనిచేయడం ఆయనకే సాధ్యమైంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈనాడు వార్తాపత్రిక విశ్వసనీయత గురించి ప్రస్తావిస్తూ.. రాత్రి 9 గంటలకు టీవీలలో ఎన్ని వార్తలు చూసినా, ఉదయం ఈనాడు పత్రిక చూసి వార్తను నిర్ధారించుకునే స్థాయి క్రెడిబిలిటీని రామోజీరావు సాధించారని సీఎం కొనియాడారు. "ఆధారాలు (డాక్యుమెంటరీ ఎవిడెన్స్) ఉంటే తనపై వార్త వచ్చినా కూడా ప్రచురించాలని జర్నలిస్టులకు పూర్తి స్వేచ్ఛనిచ్చిన మహోన్నత వ్యక్తి ఆయన. సాధారణ వ్యక్తులను ఎంచుకుని అసాధారణ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన శిల్పి రామోజీరావు" అని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా 'అమరావతి' పేరు వెనుక రామోజీరావు చేసిన పరిశోధన ఎంతో ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. శాస్త్రీయంగా, చారిత్రకంగా ఎందుకు అమరావతి పేరు పెట్టాలో పూర్తి అధ్యయనం చేసి తనకు సూచించారని, ఆ పేరును యావత్ ప్రజానీకం నూటికి నూరు శాతం ఆమోదించిందని తెలిపారు. అమరావతి నిర్మాణానికి రామోజీ గ్రూప్ తరఫున రూ.10 కోట్ల విరాళం అందించారని, కరోనా సమయంలోనూ రెండు తెలుగు రాష్ట్రాలకు చెరో రూ.10 కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. లాతూర్ భూకంపం, సునామీ, హుద్‌హుద్ వంటి ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడమే కాకుండా, ప్రజల నుంచి సేకరించిన ప్రతి పైసాకు పూర్తిస్థాయిలో లెక్కలు చూపించిన నైతికత రామోజీ గ్రూప్‌దని కొనియాడారు.జీవిత చరమాంకంలో 86 ఏళ్ల వయసులో అనారోగ్యంతో మంచానికే పరిమితమైన సమయంలోనూ రాజకీయ కుట్రలతో రామోజీరావును ఇబ్బందులకు గురిచేశారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మంచంపై ఉన్న వీడియోలను బయటకు విడుదల చేసి మానసికంగా దెబ్బతీయాలని చూసినా ఆయన ఏనాడూ తలవంచలేదని, సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేశారని అన్నారు. రామోజీరావు తెలుగు జాతికి దక్కిన ఒక గొప్ప ఆస్తి అని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. రామోజీరావు తమ కుటుంబానికి ఇచ్చింది కేవలం ఆస్తులు మాత్రమే కాదని, సమాజ హితం కోసం నిలబడే ఒక గొప్ప బాధ్యతను ఇచ్చారని, ఆ విలువలను ఎప్పటికీ ముందుకు తీసుకెళ్లాలని రామోజీ కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఆకాంక్షించారు.


లంచం కేసులో జైలుకెళ్లిన మొయినాబాద్

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గుండు వాణి

- రూ.6.76 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ - మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతిపై ఏసీబీ కొరడా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మున్సిపల్ శాఖలోని లోని అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆమెకు సంబంధించిన నివాసాలు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు సుమారు రూ.6.76 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. గతంలో రూ.75 వేల లంచం కేసులో పట్టుబడిన వాణికి తాజా దర్యాప్తుతో మరో చిక్కు ఎదురైంది.





గుండు వాణికి చెందిన ఆస్తులపై ఏసీబీ అధికారులు జరిపిన తనిఖీల్లో హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో రూ.2.45 కోట్ల విలువైన జీ+2 భవనాన్ని గుర్తించారు.అలాగే మరో రూ.63 లక్షల విలువైన ఫ్లాట్‌ను గుర్తించారు. జడ్చర్ల, పాలకుర్తి ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు, కోయిలకొండలో 1.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. మహబూబ్‌నగర్‌లోని తుల్జా భవానీ వైన్స్‌లో రూ.50 లక్షల పెట్టుబడులు పెట్టినట్లు ఆధారాలు లభించాయని అధికారులు గుర్తించారు. వివిధ కంపెనీల షేర్లలో సుమారు రూ.1.30 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల సందర్భంగా రూ.5.47 లక్షల నగదుతో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ.7.97 లక్షల నిల్వలను గుర్తించారు. 175.1 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.50 లక్షల విలువైన 2 కార్లతో పాటు మొత్తం 4 వాహనాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆస్తుల కొనుగోళ్లు, పెట్టుబడులు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీన లంచం కేసులో గుండు వాణి ఏసీబీకి చిక్కారు. ఓ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.75 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఆమె తరఫున మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాలమోని సుదర్శన్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాణి, సుదర్శన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ప్రస్తుతం గుండు వాణి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తాజా అక్రమాస్తుల కేసు దర్యాప్తులో భాగంగా ఆమెను పీటీ వారెంట్‌పై ఏసీబీ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గుండు వాణికి సంబంధించిన ఆస్తుల వివరాలను సేకరించిన ఏసీబీ అధికారులు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తనిఖీలు చేపట్టారు. ఆమె నివాసం, ఇతర ఆస్తులతో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించినట్లు సమాచారం. మొత్తం 28 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ వెల్లడించిన వివరాల్లో పేర్కొంది. స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులు, ఆదాయ మార్గాలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.
గుండు వాణి ప్రభుత్వ ఉద్యోగిగా పొందిన ఆదాయం, ఇతర చట్టబద్ధమైన ఆదాయ మార్గాలతో పోలిస్తే గుర్తించిన ఆస్తుల విలువ ఎంత ఉందనే అంశంపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తుల కొనుగోలుకు సంబంధించిన పత్రాలు, పెట్టుబడుల వివరాలు, బ్యాంకు లావాదేవీలను విశ్లేషిస్తున్నారు. సోదాలు, పత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత అక్రమాస్తుల విలువపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చైన్ మెన్ నుండి సిసిపి వరకు అక్రమ ఆస్తులైనా.?

మున్సిపల్ శాఖ లో టౌన్ ప్లానింగ్ విభాగం నందు విధులు నిర్వహించే కిందిస్థాయి ఉద్యోగి చైర్మన్ నుండి సిసిపిల వరకు భారీగా అవినీతి సొమ్ము కూడా పెట్టినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి అయితే ఇది జిహెచ్ఎంసి, ఎంఎంసి, సీఎంసీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలోని చైన్ మెన్, న్యాక్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపి, జోనల్ ఏసీపిలు, జోనల్ సిపి, సిసిపి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడంతోపాటు అక్రమ మార్గంలో నిర్మాణాలకు సహకరించడం, సీజ్ చేసిన భవనాలకు పత్తాసు పలకడం, అక్రమ నిర్మాణాలకు ఓసీలు జారీ చేయడం వంటి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏసీబీ అధికారులు టౌన్ ప్లానింగ్ బాగా అధికారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588